



ఎలమంచిలిలో కురుస్తున్న వర్షం, నీట మునిగిన రోడ్డు

ఉపాధి శ్రామికులకు అరకొర చెల్లింపులు

జనవరి నుంచి మార్చి రెండో వారం వరకే అందిన వేతనాలు

- అప్పటి నుంచి ఇంతవరకు రూ.51 కోట్లు బకాయిలు
- ఇతర పనులు లేకపోవడంతో 'ఉపాధి' కూలి డబ్బులే ఆధారం
- సత్వరమే నిధులు విడుదల చేయాలని వినతి



చెరువు గట్టు ఏర్పాటు పనుల్లో ఉపాధి శ్రామికులు

చోడవరం, మే 15 (ఆంధ్రజ్యోతి):
ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పనులు చేస్తున్న శ్రామికులకు అరకొరగానే చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి రెండో వారం నుంచి మార్చి రెండో వారం వరకు వేతనాల చెల్లింపులు జరగ్గా.. ఆ తరువాత నుంచి ఇప్పటి వరకు కూలి డబ్బులు అందలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి శ్రామికులకు సుమారు రూ.51 కోట్లు అందాల్సి వుందని అధికారులు చెబుతున్నారు.

ఉపాధి హామీ పథకం కింద మట్టి పనులు ఈ ఏడాది జనవరి 11వ తేదీ నుంచి మొదలుపెట్టగా, ఏప్రిల్ రెండో వారం వరకు ఒక్క రోజు కూలి కూడా శ్రామికులకు అందలేదు. దీంతో బకాయిల కోసం తరచూ ఆందోళనలు చేస్తున్నారు. పని ప్రదేశంలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రాష్ట్రానికి రూ.912 కోట్లు విడుదల చేయడతో జనవరి నుంచి అప్పటి వరకు చేసిన పనులకు కూలి డబ్బులు అందుతాయని శ్రామికులు భావించారు. అయితే కొన్ని మండలాల్లో మార్చి నెలాఖరు వరకు మాత్రమే కూలి డబ్బులు జమ కాగా, మరికొన్ని మండలాల్లో మార్చి రెండో వారం వరకే వచ్చినట్టు చెబుతున్నారు. మొత్తం మీద రూ.25-30 కోట్లు విడుదల అయినట్టు తెలిసింది. వాస్తవానికి ఏప్రిల్ రెండో వారం వరకు వేతనాలు క్లియర్ అవుతాయని శ్రామికులు భావించారు. కానీ మార్చి రెండో వారం వరకే అందడంతో అప్పటి వరకు ఇల్లు గడవడానికి చేసిన అప్పులకు డబ్బులు సరిపోయాయని, మళ్లీ సరకుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని, లేదంటే కిరాణా షాపుల్లో అరువుపై సరకులు తీసుకోవాల్సి వస్తున్నదని శ్రామికులు వాపోతున్నారు.

ప్రస్తుతం మే నెల రెండో వారం కూడా ముగిసింది. ఉపాధి శ్రామికులకు రెండు నెలలకుపైగా కూలి డబ్బులు అందాల్సి ఉంది. జనవరి నుంచి మార్చి వరకు పొలాల్లో పనులు వుండడంతో ఉపాధి పనులకు అంతంత మాత్రంగానే హాజరు వుండేది. ఏప్రిల్ నుంచి శ్రామికుల హాజరు బాగా పెరిగింది. దీంతో పెండింగ్ వేతనాలు రూ.50 కోట్లకుపైబడి వున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేరే పనులు కూడా లేవని, ఉపాధి పనులే ఆధారమైనందున త్వరగా నిధులు విడుదల అయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఉపాధి శ్రామికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి సిబ్బంది వేతనాలు సైతం..

ఉపాధి హామీ పథకం పనులు చేయించే సిబ్బందికి, అధికారులకు కూడా వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నట్టు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకే వేతనాలు అందినట్టు చెబుతున్నారు. మే నెలలో రెండు వారాలు పూర్తయినప్పటికీ ఏపీవోలు, ఫీల్డు అసిస్టెంట్లు ఇతర కార్యాలయ సిబ్బందికి ఇంకా వేతనాలు జమకాలేదు. కాగా ఉపాధి శ్రామికుల వేతన బకాయిలపై డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. మార్చి నెల వరకు వేతనాలు అందాయని, ఏప్రిల్ నుంచి చెల్లించాల్సి వుందన్నారు. ఈ వారంలో నిధులు విడుదల అయ్యే అవకాశం వుందని, సిబ్బందికి వేతనాలు కూడా ఈ వారంలోనే జమ అవుతాయని భావిస్తున్నట్టు చెప్పారు.

పిడుగుల వర్షం

పలు మండలాల్లో ఈదురు గాలుల బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పిడుగులు పడి పశువులు, జీవాలు మృతి
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీక్షణంగా కాసిన ఎండ
- అనంతరం మారిన వాతావరణం
- పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం
- నేడు, రేపు వర్షసూచన





మాడుగుల మండలం సత్యవరంలో ఈదురుగాలులకు కూలిన చెట్లు (ఇన్‌సెట్‌లో) ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

అనకాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్):
జిల్లాలో గురువారం భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దారెత్తించింది. సగానికిపైగా మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం తరువాత వాతావరణం మారిపోయింది. ఆకాశంలో మేఘాలు కుమ్ముకున్నాయి. అనంతరం ఈదురుగాలులు ఆరంభం అయ్యాయి. మరికొద్దిసేపటికి ఉరుములు, పిడుగులతో వర్షం మొదలైంది. ఈదురు గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఇళ్ల రేకులు లేచిపోయాయి. మామిడి, బొప్పాయి తోటల్లో కాయలు నేలరాయి. పిడుగులు పడడంతో మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో పశువులు, మేకలు మృత్యువాత పడ్డాయి. వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. వర్షం కారణంగా నేల మెత్తబడి వేసవి దుక్కులకు దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు.

అనకాపల్లి పట్టణంలో మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ మండిపోయింది. తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. 11.3 ఎం.ఎం.గా వర్షం కురిసింది. చోడవరంలో ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. ఆకాశంలో దట్టంగా కుమ్ము కున్న మేఘాలను చూసి భారీ వర్షం కురుస్తుందని భావిం చారు. అయితే ఈదురు గాలు లు వీచడంతో మేఘాలు వర్షించకుండానే వెళ్లిపోయాయి. మండలంలోని గంధవరంలో పిడుగుపడి యలమంచిలి నానాజీ అనే రైతుకు చెందిన ఆవు మృతిచెందింది.

ఉరుములు, పిడుగులతో రావికమతం మండలం దద్దరిల్లిపోయింది. రావికమతం శెట్టి వారి పొలాల వద్ద మేత కోసం వచ్చిన మేకలు, గొర్రెల మందపై పిడుగు పడింది. దీంతో మరుపాక గ్రామానికి చెందిన నమ్మి వెంకటస్వామికి చెందిన ఐదు మేకలు, శీరా సాంబకు చెందిన ... మిగతా 8వ పేజీలో

మధ్యాహ్నం వరకు దారెత్తించిన ఎండ

జిల్లాలో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీక్షణంగా కాసింది. పది గంటల నుంచి రహదారులపై జన సంచారం తగ్గిపోయింది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు గరిష్ఠసాయికి చేరుకున్నాయి. ఎండ వేడికితోడు ఉక్కపోతతో జనం విలవిలలాడారు. అయితే మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. చల్లగా ఈదురు గాలులు వీచాయి. పలుచోట్ల వర్షం పడింది. కాగా జిల్లాలో చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, నర్సీపట్నం, నాతవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కె.కోటపాడు, సబ్బవరంలో 40.1 డిగ్రీలు, అనకాపల్లి, బుచ్చెయ్యపేట, చోడవరం, కోటవురట్ల, పరవాడలో 40 డిగ్రీలు, అచ్యుతాపురం, కశింకోట, మాకవరపాలెం, మునగపాక, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల్లో 39.9 డిగ్రీలు నమోదయ్యాయి.

టార్గెట్ మలేరియా

2027నాటికి 'జీరో కేసుల' నమోదే లక్ష్యం



కోటవురట్ల మండలం తిమ్మాపురంలో ఐఆర్ఎస్‌కు ఎంపిక చేసిన ఇంటికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

- జిల్లాలో 108 గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఇంటి లోపల, బయట గోడల మీద మందు పిచికారీ
- ఇప్పటికే మొదటి విడత స్ప్రేయింగ్ పూర్తి
- జూన్ ఒకటి నుంచి రెండో విడత...
- అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మందు పిచికారీ
- జిల్లాలో 2023లో 175, గత ఏడాది 259 మలేరియా కేసులు నమోదు
- ఈ ఏడాది మే 11 నాటికి 120 మంది మలేరియా బాధితులు



మాడుగుల మండలం ఎం.గదబూరులో ఒక ఇంట్లో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి):
రానున్న రెండేళ్ల కాలంలో మలేరియాను పూర్తిగా నివారించడానికి జిల్లా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో పలురకాల కార్యక్రమాలు చేపడతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇచ్చిన పిలుపుతో 2027 నాటికి మలేరియా కేసులను 'సున్నా'కు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా మలేరియా ప్రబలడానికి కారణమయ్యే దోమల నివారణ , పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

వర్షాకాలంలో పారిశుధ్యలోపం, దోమల పెరుగుదల కారణంగా ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకు మలేరియా కేసులు అధికంగా నమోదు అవుతుంటాయి. గిరిజన గ్రామాలు, వాటిని ఆనుకొని మైదాన గ్రామాల్లో మలేరియా కేసులు అధికంగా న మోదు అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకుని వున్న మండలాల్లోని గిరిజన గ్రామాలతోపాటు వాటికి సమీపంలో వున్న మైదాన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దేవరాపల్లి ... మిగతా 8వ పేజీలో

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా!

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

- ఒకేచోట ఐదేళ్ల సర్వీసు నిండితే బదిలీ తప్పదు
- రెండేళ్లు దాటినా.. బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు
- దివ్యాంగులు, కారుణ్య ఉద్యోగులకు మినహాయింపు
- జిల్లాలో 1,500 మందికి స్థాన చలనం?



అనకాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి):
ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించి గురువారం జీవో జారీ చేసి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి ఒకచోట ఐదు సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగికి బదిలీ తప్పనిసరి చేస్తూ నిబంధన పెట్టింది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకొనేందుకు (రిక్వెస్టు) అవకాశం కల్పించింది. 40 శాతం దివ్యాంగులైన ఉద్యోగులు, కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందిన వారికి బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని జీవోలో పేర్కొన్నది. బదిలీల ప్రక్రియను ఈ నెల 16వ తేదీన (శుక్రవారం) ప్రారంభించి జూన్ 2వ తేదీతో ముగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే విద్య, పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో ప్రస్తుతానికి బదిలీలు లేవు. రెవెన్యూ, వైద్య, వ్యవసాయ, సంక్షేమ శాఖలు, ఖజానా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, గృహ నిర్మాణ, తదితర శాఖల్లో బదిలీలు వుంటాయి. జిల్లాలో వివిధ విభాగాలకు చెందిన ... మిగతా 8వ పేజీలో

ఈసెట్‌లో 93.58 శాతం ఉత్తీర్ణత

- కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో జిల్లాకు 6వ ర్యాంకు



పవన్ స్వామి
6వ ర్యాంకు
(కెమికల్ ఇంజనీరింగ్)


అనకాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి):
జే ఎన్ టీ యు ఏ అనంతపురం ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించిన ఏపీ ఈసెట్-2025 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ పరీక్షకు జిల్లా నుంచి 118 మంది బాలురు, 72 మంది బాలికలు మొత్తం 190 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా ఈ నెల 6న జరిగిన పరీక్షకు 115 మంది బాలురు, 72 మంది బాలికలు.. మొత్తం 187 మంది హాజరయ్యారు. వీరిలో 105 మంది బాలురు, 70 మంది బాలికలు. మొత్తం 175 మంది (93.58 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మునగపాక మండలం టి.సిరసపల్లికి చెందిన పొలమరశెట్టి పవన్ స్వామి కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 116 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు.

ప్రాజెక్టుల పరుగు..

రూ.400 కోట్ల విలువైన పనుల ప్రారంభోత్సవాలకు సన్నాహాలు

- కొత్తవి చేపట్టేందుకు త్వరలో శంకుస్థాపనలు
- నూతనంగా ఐదు లేఅవుట్లు
- వీటిల్లో ఒకటి తుమ్మపాలలో 15 ఎకరాల్లో ఏర్పాటు
- అనకాపల్లిలో కొత్తగా జోనల్ కార్యాలయం
- కైలాసగిరిపై రూ.1.5 కోట్లతో 55 అడుగుల శివుడి త్రిశూలం ఏర్పాటు
- మాస్టర్ ప్లాన్ రహదారులకు టీడీఆర్‌లు
- కాకాని నగర్‌లో రూ.12 కోట్లతో సబ్‌వే

'ఆంధ్రజ్యోతి'తో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్



కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న 55 అడుగుల త్రిశూలం నమూనా



వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) రూ.400 కోట్లతో నిర్మించిన పలు ప్రాజెక్టులు, చేపట్టేబోయే కొత్త ప్రాజెక్టులకు త్వరలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్టు కమిషనర్ కె.విశ్వనాథన్ తెలిపారు. అలాగే కొత్తగా ఐదు లేఅవుట్లను వేయనున్నామన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో మాట్లాడుతూ అనేక అంశాలను వివరించారు. ఆయా వివరాలు ఆయన మాటల్లోనే..

అనకాపల్లి పక్కనున్న తుమ్మపాలలో 15 ఎకరాలు, విశాఖ నగరంలోని కాపులుప్పాడలో 20 ఎకరాలు, నిడిగట్టులో 12 ఎకరాలు, గిడిజాలలో 7.5, చిన ముషిడివాడలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కొత్త లేఅవుట్లు వస్తాయి.

మొత్తం మూడు మాస్టర్ ప్లాన్ పనులను ఏకకాలంలో చేపడుతున్నాం. గతంలో ఖరారు చేసిన మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాలను ఆహ్వానించి మార్పులు, చేర్పులతో కొత్తది తయారుచేస్తాం. అలాగే విశాఖపట్నం-కాకినాడ పెట్రో కెమికల్ పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌కు కూడా కొత్త మాస్టర్ ప్లాన్ను ... మిగతా 8వ పేజీలో

టీడీపీ మండల అధ్యక్షుడిగా తులసీరామ్



అచ్యుతాపురం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా ఖాజీపాలెం గ్రామానికి చెందిన పీలా తులసీరామ్ ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ ఎన్నికలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తులసీరామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం తులసీరామ్‌ను మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పరిశీలకులు జగన్నాథం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, కె.సాయికృష్ణ, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

టీడీపీ గొరపూడి గ్రామ అధ్యక్షుడిగా యశ్వంత్



రాంబిల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గొరపూడి గ్రామ అధ్యక్షుడుగా అప్పన్నపాలెంకు చెందిన లెక్కల యశ్వంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 సంవత్సరాల యశ్వంత్‌కు అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులో అధ్యక్ష పదవికి ఎంపిక చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ పంచాయతీలో టీడీపీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు.

కృష్ణస్వామికి ఘన సత్కారం



కృష్ణస్వామిని సత్కరిస్తున్న త్రిదండి శఠకోపముని రామానుజ జీయర్‌స్వామి

పాయకరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ మేరైన్ గౌరవ డాక్టరేట్‌ను పొందిన స్థానిక పాండురంగస్వామి ఆలయ ప్రధానార్చకుడు ఈయుణ్ణి కృష్ణస్వామిని శ్రీవిల్లిపుత్తూరు మనవాళ మహాముని 23వ పీఠాధిపతులు త్రిదండి శఠకోపముని రామానుజ జీయర్ స్వామి గురువారం సత్కరించారు. వైదిక సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారంలో విశిష్ట సేవలందించినందుకు కృష్ణస్వామికి గౌరవ డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కృష్ణస్వామికి గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కేఆర్‌జే.శర్మ, యజ్ఞవల్క్యశర్మ, ప్రసాదాచార్యులు, ఈయుణ్ణి నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆవకాలువలో తుప్పలు తొలగింపు



అనకాపల్లి ఆవ కాలువలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

మునగపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి నుంచి ఆవ కాలువలో ఉన్న తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో గురువారం తొలగించారు. రైతులు విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాలతో తుప్పలను తొలగిస్తున్నామని అనకాపల్లి ఆవకాలువ చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు(జేకే నాయుడు), టీడీపీ నాయకుడు పొలమరశెట్టి మురళీకృష్ణ తెలిపారు. మునగపాక పెద్ద మదుం వరకు పనులు జరుగుతాయని, ఆ తరువాత కాలువ గట్టుకు హద్దులు కూడా వేస్తామన్నారు. పొలాలకు సాగునీరు అందడానికి పనులు దోహదంగా నిలుస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పంచతంత్రం కథలతో నైతిక విలువలు

నక్కపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్య దశ నుంచే పంచతంత్రం వంటి కథలు చదవడం వల్ల వారిలో నైతికల విలువలు పెరుగుతాయని చినదొడ్డిగల్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు నీతి, పంచతంత్రం కథలు చదవడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జూన్ 6 ముగింపు సమావేశంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.

నేరెళ్ల కాలువ గట్లు ఆక్రమణ

- పక్కా నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- కాలువలో పూడికతీతకు అడ్డంకిగా మారనున్న నిర్మాణాలు
- వర్షాకాలంలో సమీప కాలనీలు నీట మునిగే అవకాశం



గౌతమ్ స్కూల్ వెనుక నేరెళ్ల కాలువ గట్టుపై నిర్మిస్తున్న ప్రహరీగోడ

పాయకరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీలో స్థలాల విలువ పెరగడంతో పంట కాలువల గట్లు ఆక్రమణలపాలవుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు కనీసం పట్టించుకోని కారణంగా పట్టణంలో నుంచి ఉన్న భూమి, నేరెళ్ల పంట కాలువల గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. గట్ల స్థలాలను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. తాజాగా పట్టణంలోని గౌతమ్ స్కూల్ వెనుక ప్రాంతంలో నేరెళ్ల కాలువ గట్టును ఆక్రమించి ప్రహరీగోడ నిర్మిస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టణంలో భూమి పంట కాలువకు అనుసంధానంగా స్థానిక సాయి ఆదర్శనగర్ నుంచి మంగవరం పంట కాలువ వరకు నేరెళ్ల కాలువ ఉంది. ఈ కాలువ పూర్వం వంద ఎకరాలకు సాగునీరందించేది. కాలక్రమంలో పట్టణాన్ని ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములన్నీ లేఅవుట్లుగా అభివృద్ధి చేయడంతోపాటు మురికి కాలువలను పంట కాలువకు కలిపారు. దీంతో కాలువలో చెత్త, పూడిక పేరుకుపోవడంతో నేరెళ్ల కాలువ ఉనికి కోల్పోయింది. దీనికితోడు ఈ కాలువను ఆనుకుని ఉన్న సాయిఆదర్శనగర్, జీవీఆర్.నగర్, గౌతమ్ స్కూల్ వెనుక ప్రాంతాల్లో కాలువ గట్లు పలుచోట్ల ఆక్రమణలపాలవుతున్నాయి. దీంతో మురికినీరు పారే అవకాశం లేకుండా పోయింది. వర్షాకాలం వచ్చిందంటే కాలువను ఆనుకుని ఉన్న కాలనీలు ముంపుబారిన పడుతున్నాయి. దీంతో రెండేళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు సుమారు రూ.10 లక్షలు వెచ్చించి కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. ఆ తరువాత నుంచి పట్టించుకున్నవారు లేక కాలువలో ఎక్కడికక్కడ చెత్త, పూడిక, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీనిని ఆసరాగా తీసుకొని గౌతమ్ స్కూల్ వెనుక ఒక స్థల యజమాని నేరెళ్ల కాలువ గట్టును ఆక్రమించి ప్రహరీగోడ కడుతున్నారు. దీని కారణంగా రానున్న రోజుల్లో కాలువలో పూడికతీతకు తీవ్ర అడ్డంకి ఏర్పడనుంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కళ్లెదుటే కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేరెళ్ల కాలువ గట్ల ఆక్రమణలు తొలగించడంతోపాటు భవిష్యత్తులో ఆక్రమణల బారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



ఎలమంచిలిలో కురుస్తున్న వర్షం

ఎలమంచిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో గురువారం సాయంత్రం గంటసేపు ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో అల్లాడిన జనం సాయంత్రం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు అంతంతమాత్రం కావడంతో పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. పట్టణంలోని క్లబ్ రోడ్డు పూర్తిగా వర్షం నీటితో నిండిపోవడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డుపైన వర్షం నీరు నిలిచిపోయింది.

కోటవురట్లలో..

వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో పలుగ్రామాల్లో వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలో కోటవురట్ల, కైలాసపట్నం రాజుపేట, బీకేపల్లి, యండపల్లి, చౌడువాడ. గొట్టివాడ, రామచంద్రపురం గ్రామాల్లో సుమారు గంటన్నరపాటు వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలో చెత్తచెదారం కొట్టుకుపోయింది. ఈ వర్షం ఖరీఫ్ దుక్కులకు ఉపయోగకరంగా, కూరగాయల పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



కోటవురట్లలో వర్షం

రాంబిల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు ఎండ తీవ్రంగా కాసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని అర్థగంటసేపు వర్షం కురిసింది. పంట భూములు దున్నుకొనేందుకు ఈ వర్షం కొంతమేర సరిపోతుందని రైతులు చెబుతున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్
- జాబ్ మేళాకు విశేష స్పందన...
- హాజరైన 26 పరిశ్రమల ప్రతినిధులు



జాబ్‌మేళాకు హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ యువకులు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు పోతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతున్నాదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలపడమే లక్ష్యమన్నారు. ఈ జాబ్ మేళాకు వచ్చిన 28 మెగా పరిశ్రమల ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడి వారికి మరిన్ని సూచనలు అందించారు. జాబ్‌మేళాకు వచ్చిన సుమారు 3 వేల మంది నిరుద్యోగులకు పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 550 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 52 వేల హెక్టార్లలో వరి సాగు

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు

కోటవురట్ల మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 52 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన కోటవురట్ల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23 వేల క్వింటాళ్ల వరి విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. జూన్ 15నాటికి రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులకు వ్యవసాయ పనులకు అవసరమైన పరికరాలను 50 శాతం రాయితీపై అందజేస్తామన్నారు. ఆరు రకాలు యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 1000 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. వారికి రూ.2కోట్ల సబ్సిడీ మంజూరైందన్నారు. జిల్లాలో 25,505 మట్టి నమూనాలు లక్ష్యంగా 12 వేలు సేకరించారన్నారు. మిగతా నమూనాలు నెలాఖరునాటికి పూర్తవుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించినట్టు ఆయన తెలిపారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆయనతోపాటు వ్యవసాయశాఖ ఏడీ ఉమాప్రసాద్, స్థానిక ఏవో సరోజని తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రుణాలకు బ్యాంకులు ప్రాధాన్యమివ్వాలి

- జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కోటవురట్ల మే 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌లో పెట్టుబడులకు వ్యవసాయ రుణాల మంజూరుకు బ్యాంకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశమందిరంలో నాతవరం, మాకవరపాలెం, కోటవురట్ల మండలాల వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులకు రుణాలు మంజూరుకు ఇప్పటి నుంచి బ్యాంకుల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పాడిరైతులకు అధిక రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎంఈజీపీ పథకం కింద నిరుద్యోగులైన యువతి యువకులు కుటీర పరిశ్రమల నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తే కేంద్ర ప్రభుత్వం రాయితీ పొందేందుకు దోహదపడుతుందన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతర కులాలు వారికి 30శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సోలార్‌యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎస్‌బీఐ మేనేజర్లు సోమశేఖర్, మాకవరపాలెం మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాల్సిందే

- కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్



ప్యాకేజీ ఇవ్వాలని నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

నక్కపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు ఇళ్లను కోల్పోతున్నారని, అటువంటి కుటుంబాల్లో 18 ఏళ్లు వయస్సునిండిన ప్రతి ఒక్కరికీ రూ. 25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని నిర్వాసితులు, రైతు సంఘ ప్రతినిధులు, వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చందనాడ శివారు తమ్మయ్యపేటలో నిర్వాసితులతో కలిసి సమావేశం నిర్వహించారు. వీరికి వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, రైతు సంఘం ప్రతినిధులు తళ్లా భార్గవ్, జీ గోవిందరావు తదితరులు విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించకుండా కారిడార్ భూముల్లో అధికారులు పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఇళ్లు కోల్పోతున్న వారికి ఒక్కొక్కరికీ రూ. 8.36 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిర్వాసితులందరికీ అది ఆమోదయోగ్యంగా లేదన్నారు. వీరందరికీ రూ. 25 లక్షలు చొప్పున ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డి.ఫారం, సాగు భూముల్లో చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రతీ కుటుంబానికి ఆర్‌ఆర్ కార్డులు మంజూరు చేసి, స్థానికంగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వి.నూకరాజు, పి.శ్రీనివాసరావు, కె.దొరబాబు, చిన్న, ప్రసాద్, ఆర్ చిన్నాయుడు, సుబ్బారావు, నర్సింహమూర్తి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

పాయకరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ తరగతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం పురస్కరించుకుని శిక్షణ తరగతుల్లో విశ్రాంత ఉపాధ్యాయులు సీతారామ్మూర్తి విద్యార్థులకు కుటుంబ వ్యవస్థ, విలువలు తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు పుస్తక పఠనం, భగవద్గీత శ్లోకాలు, ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సు, నీతిపద్యాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా మాస్టారు రాజు విద్యార్థులకు యోగా నేర్పించారు.

ఏపీ ఈసెట్‌లో టి.సిరసపల్లి విద్యార్థికి 6వ ర్యాంక్



పవన్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

మునగపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈసెట్ పరీక్షలో టి.సిరసపల్లి గ్రామానికి చెందిన పొలమరశెట్టి పవన్ స్వామి సత్తా చాటాడు. బీ.టెక్‌లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన ఈసెట్ పరీక్షలో కెమికల్ విభాగంలో పవన్ స్వామి రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంక్ సాధించాడు. 200 మార్కులకుగాను 116 మార్కులు వచ్చినట్టు పవన్ తెలిపాడు. దీంతో పవన్ స్వామికి తల్లిదండ్రులు చక్రపాణి, హేమ, పలువురు స్థానికులు మిఠాయి తినిపించి అభినందించారు.

ఘనంగా గ్రామ దేవతల జాతరలు



వాడనర్సాపురంలో దుర్గాలమ్మను దర్శించిన ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురంలోని దుర్గాలమ్మ అమ్మవారు, ఆర్.నర్సాపురంలో బండిమాంబ అమ్మవారి జాతరలను గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు దర్శించుకొని, ప్రజలు చేశారు. మొక్కులను చెల్లించుకున్నారు. వాడనర్సాపురంలోని దుర్గాలమ్మని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ, జనసేన నాయకులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర దర్శించి, పూజలు చేశారు. ఆలయాల వద్ద విద్యుత్ అలంకరణ ఆకట్టుకున్నది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

తాండవ నదిలో కొబ్బరి బొండాలు, చెత్త తొలగింపు



సత్యవరం వద్ద కొబ్బరి బొండాలు, చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పాయకరావుపేట రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం సమీపంలో తాండవ బ్రిడ్జి వద్ద నదిలో వేసిన కొబ్బరి బొండాలు, చెత్త, చెదారాలను గురువారం అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈనెల 12వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'డంపింగ్ యార్డుగా తాండవ' శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. గురువారం కొబ్బరి బొండాలు, చెత్తా, చెదారాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కార్యక్రమంలో సత్యవరం సర్పంచ్ సకిలేటి రాము, గెడ్డమూరి శ్రీనివాసరావు, కూలి నానాజీ పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో జనవాణికి అధికారులు ఎలా వెళతారు : సీపీఎం



విలేకర్లతో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

మునగపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యాలయాల్లో నిర్వహించే జనవాణి కార్యక్రమాలకు అధికారులు ఎలా వెళతారని సీపీఎం జిల్లా కార్యవర్గవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కి అధికారులు వెళ్లారని, వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల స్థాయిలో నిర్వహించడానికి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, వాటిని వదిలి పార్టీ కార్యాలయంలో నిర్వహించడంతో సమస్యలు చెప్పుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజి, ఎంపీఎస్.నారాయణ, టెక్కలి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

మునగపాక, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో టి.సిరసపల్లి శివారు రామారాయుడుపేటలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైసీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, నాయుడు అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు.

రైల్వే స్టేషన్ ఎదుట అంధకారం



ఎలమంచిలి రైల్వే స్టేషన్ ముందు వెలగని విద్యుత్ లైటు

ఎలమంచిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ వద్ద వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారమైంది. దీంతో రైళ్ల నుంచి దిగి వచ్చే ప్రయాణికులు రైల్వే స్టేషన్ నుంచి బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్ రోడ్డులో ఇటీవల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు పొడవునా విద్యుత్ కాంతులు మెరుస్తున్నాయి. కానీ రైల్వే స్టేషన్ ముందున్న విద్యుత్ లైటు కొన్ని రోజులు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంది. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట

- మ్యారేజ్ సర్టిఫికెట్లకు పరుగో పరుగు
- కొత్త రేషన్ కార్డులకు తప్పనిసరి
- మూడు రోజుల వ్యవధిలో జిల్లాలో 590 ధ్రువపత్రాలు

నర్సీపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ సర్టిఫికెట్ దరఖాస్తు దారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. కొత్త రేషన్ కార్డులకు ఈ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో కొత్తగా పెళ్లి అయిన వారు, రెండు, మూడేళ్ల క్రితం అయినవారు మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. కొత్త రేషన్ కార్డులకు ఈనెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిన విషయం తెలిసిందే.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద పడిగాపులు

మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం ముందు రోజు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ప్రభుత్వానికి రూ.500 చలనా, రూ.1000 ఇతర ఖర్చులు అవుతున్నాయి. స్లాట్‌లో ఇచ్చిన సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. ఒకవేళ వెళ్లలేకపోతే రెండో రోజు మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవల్సి వస్తుంది. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత శుభలేఖ, పెళ్లి ఫొటో, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్ జత చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేయడానికి రెండు రోజులు సమయం పడుతుంది. గత వారం రోజులుగా నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకి 25 నుంచి 30 మ్యారేజ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. సాధారణ రోజుల్లో ఒకటి రెండు సర్టిఫికెట్లు మించి ఇచ్చే అవసరం పడేది కాదు. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం వస్తున్న వారితో పాటు సాక్షి సంతకం పెట్టడానికి మరో ఇద్దరిని వెంట తీసుకు వస్తున్నారు. దీనికి తోడు ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి స్లాట్ బుకింగ్ ప్రకారం రోజుకి 39 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. దీనికి కూడా ఇద్దరి సాక్షి సంతకం అవసరం. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిక్కిరిసిపోతుంది. జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మూడు రోజుల వ్యవధిలో 590 మ్యారేజ్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్న విద్యార్థిని విద్యార్థులు

సచివాలయాలలో దరఖాస్తులు

కొత్త రేషన్ కార్డులు కావల్సినవారు వార్డు, గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు పట్టుకొని వెళితే సరిపోతుంది. కొత్తగా పెళ్లైన వారు తప్పనిసరిగా మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేయాలి. వరుడు తల్లిదండ్రులు రేషన్ కార్డులో వధువు పేరు యాడ్ చేస్తారు. తర్వాత ఆ రేషన్ కార్డు నుంచి వధూవరులను వేరే చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తారు. రేషన్ కార్డు దరఖాస్తుకు పెళ్లైన వారికి మ్యారేజ్ సర్టిఫికెట్ మినహాయింపు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నా సచివాయాలకు ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు రాలేదని అధికారులు అంటున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి


వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

గొలుగొండ, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి గురువారం పరిశీలించారు. రోజువారీ పీహెచ్‌సీకి వచ్చే రోగుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు వైద్యాధికారులు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఏఎన్‌ఎంలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో వుండే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు సుబ్బారావు

సీపీఐ జిల్లాల కార్యదర్శులు రామునాయుడు, సత్యనారాయణ


కృష్ణాదేవిపేటలో స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లాల కార్యదర్శులు సత్యనారాయణ, రామునాయుడు

కృష్ణాదేవిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పోరాటయోధుడు కేవీఎస్ సుబ్బారావు అని సీపీఐ అల్లూరి, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు పొట్టిక సత్యనారాయణ, మాకిరెడ్డి రామునాయుడు కొనియాడారు. గురువారం దివంగత సుబ్బారావు 33వ వర్ధంతి సందర్భంగా కృష్ణాదేవిపేటలో ఆయన స్థూపం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకా సత్యనారాయణ, గొలుగొండ, కొయ్యూరు మండల కార్యదర్శులు జి.రాధాకృష్ణ, ఇరువాడ దేముడు, నాయకులు మేకా భాస్కరరావు, సుబ్బారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై దాణా పంపిణీ

నర్సీపట్నం అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు 50శాతం రాయితీపై దాణాను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని, పాడి రైతులు సద్వినియోగపర్చుకోవాలని వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళెం రాంప్రసాద్ తెలిపారు. గురువారం వేములపూడి, చెట్టుపల్లి, మొండికండి, ధర్మసాగరం, నీలంపేట, గబ్బాడ, కేఎల్.పురం, ఓఎల్.పురంల్లో 95 మంది పాడిరైతులకు దాణాను చెట్టుపల్లి పశువైద్య కేంద్రంలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పుష్ప, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీరంగస్వామి, నాయకులు గజాల సూరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని అమ్మాయికి ఘనంగా ఓణీ ఫంక్షన్

సాయమందించిన డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీలు, టీచర్లు, గ్రామపెద్దలు


తల్లిదండ్రులు లేని అమ్మాయి దేవికి బంగారం, నగదు, దుస్తులు అందిస్తున్న దృశ్యం

నాతవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతి చెందిన అమ్మాయికి చినగొలుగొండపేట గ్రామస్థులు ఓణీ ఫంక్షన్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా ఆమె ఉన్నత చదువుకు సాయపడతామని భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళ్లితే..

మండలంలోని చినగొలుగొండపేటలో కుందేటి శాంతమ్మ, చిన్నబ్బాయి రెండేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో వారి కుమార్తె కుందేటి దేవి నాయనమ్మ కొండయ్యమ్మ సంరక్షణలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నది. వారం రోజుల క్రితం దేవి పుష్పవతి అయ్యింది. తల్లిదండ్రులు లేని ఆమెకు ఓణీ ఫంక్షన్‌ను జరిపేందుకు గ్రామ వీవోఏ గాడి అర్జమ్మ డ్వాక్రా మహిళలతో చర్చించారు. డ్వాక్రా మహిళలు కొంత సొమ్ము పోగు చేయగా... ఈ విషయం తెలిసిన అంగన్‌వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు, తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ అంకంరెడ్డి రాజుబాబు, తదితరులు సాయమందించారు. వీరందరూ గురువారం రూ.20వేలు నగదు, పావుతులం బంగారం, ఆరు తూలల పట్టీలు, నాలుగు జతల బట్టలు అందజేసి దేవి ఓణీ ఫంక్షన్‌ను ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా దేవి ఉన్నత చదువులకు సాయమందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని గ్రామస్థులు అభినందించారు.

విరాట్ విశ్వకర్మ మహా యజ్ఞానికి సహకరించండి

స్పీకర్‌ను కోరిన విశ్వ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం నిరాటంకంగా జరగాలని కోరుతూ విరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించడానికి అవసరమైన సహాయారం అందజేయాలని విశ్వ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కోరారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో సంఘం నాయకులు స్పీకర్‌ని కలిశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ మహాయజ్ఞం అమరావతిలో మూడు రోజులు నిర్వహించడానికి అవసరమైన అనుమతులు, స్థలం, ఇతర ఏర్పాట్లు కోసం ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం కల్పించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు కార్యక్రమం నిర్వహణకు ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేముల కన్న ప్రసాద్, బేతాల సన్యాసిరావు, అలుగోలు సత్యారావు, పూడి సురేష్, పెదపాటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): సన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు నెలలు నిర్వహించిన ఉచిత ఎంసెట్ కోచింగ్ క్లాసులు ముగిశాయి. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలిపి ఎంసెట్ హాల్ టిక్కెట్లు అందజేశారు. సన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, ఆర్గనేజర్ కృష్ణ తదితరులున్నారు.

ఘనంగా కామేశ్వరమ్మ పండుగ

మాకవరపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో కామేశ్వరమ్మ పండుగను గురువారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఉచితంగా కంపోస్టు గుంతలు తవ్వుకోవాలి


మాధవనగరంలో పొలాల్లో కంపోస్టు గుంతలు తవ్వుతున్న దృశ్యం

నాతవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు ఉపాధి హామీ నిధులతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకునేలా సొంత భూమిలో కంపోస్టు గుంతలు తవ్వుకోవాలని ఎంపీడీవో ఉష్రశ్రీ కోరారు. పశువుల వ్యర్థాలు, పాడిచెత్తల నుంచి సేంద్రియ ఎరువులు తయారుకు ఈ గుంతలు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే డ్రైనేజీలు లేని ఇళ్లల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. గురువారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించడమే కాకుండా మాధవనగరం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన కంపోస్టు గుంతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దాసరి కొండాజీ, ఎపీఎం కనకరాజు పాల్గొన్నారు.

చలిసింగంలో వైద్య శిబిరం


రోగులను తనిఖీలు చేస్తున్న వైద్యాధికారిణి సురేఖ

రావికమతం, మే 15 ఆంధ్రజ్యోతి): మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామమైన చలిసింగంలో గురువారం కొత్తకోట పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్న విషయంఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డీఎంహెచ్‌వోతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారి సురేఖ ,వైద్య సిబ్బంది గురువారం కాలినడకన చలిసింగం వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురుకి రక్త పరీక్షలు నిర్వహించగా మలేరియా నిర్ధారణ కాలేదని వైద్యాధికారిణి తెలిపారు. సీజనల్ జ్వరాలే ఉన్నట్టు గుర్తించామన్నారు. సిబ్బంది పాతాళ రామారావు, రమణ,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే రాజు


మంగళాపురం ఆనకట్ట నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నట్టు ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలో గురువారం మంగళాపురం ఆనకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ఆనకట్ట పనులు గతంలో ఎంపీ ల్యాండ్ రూ.40 లక్షలతో చేపట్టగా, అనంతరంనిధుల కొరతతో అసంపూర్తిగా ఆపేశారు. దీంతో రైతులు, కూటమి నాయకులు విజయరామరాజుపేట మాజీ సర్పంచ్ దొడ్డి కిశోర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారా విశాఖ డెయిరీకి విజ్ఞప్తి చేశారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, గేదెల సత్యనారాయణతో కలిసి ఆనకట్టను పరిశీలించి రూ.7లక్షలు డెయిరీ ట్రస్టు నుంచి మంజూరుచేశారు. ఈ నిధులతో నిర్మాణ పనులు చేప ట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు జి.కోటేశ్వరరావు, తమరాన దాసు, వియ్యపు అప్పారావు, కోరుకొండ రవికుమార్, దొడ్డి కిశోర్, కోట సత్యనారాయణ, ఇరిగేషన్ జేఈ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జీలను కలిసిన ఎస్పీ తుహిన్‌సిన్హా


జిల్లా న్యాయమూర్తులకు పుష్ప గుచ్ఛమందిస్తున్న ఎస్పీ

చోడవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె. రత్నకుమార్, 4వ అదనపు జిల్లాకోర్టు జడ్జి ఎం. నాగేశ్వరరావును జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కోర్టు సముదాయాన్ని సందర్శించిన ఎస్పీ అనంతరం జడ్జీలను ఇటీవల జిల్లా పరిధిలోని గంజాయి అక్రమ రవాణా కేసులు, హత్య కేసుల వంటి ప్రధాన నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలను వివరించారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

చోడవరం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. సీఐ అప్పలరాజు, ఎస్ఐలు నాగకార్తీక్, జోగారావు పాల్గొన్నారు.

మాడుగుల మోదకొండమ్మ జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశం


జాతర పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు, కమిటీ సభ్యులు

మాడుగుల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర జిల్లాలో పేరొందిన మాడుగుల మోదకొండమ్మ జాతర వైభవంగా జరిపించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధికారులకు సూ చించారు. గురువారం స్థానిక పంచాయతీ అతిథి గృహంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అధికారులు సమీక్ష సమావేశంలో ఆయన ఆయన మాట్లాడారు. జూన్ 3వ తేదీన అమ్మవారి జాతర ఉత్సవం నిర్వహించేందుకు కమిటీ తేదీ ఖరారు చేసిందన్నారు. ఈ జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవం రోజు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. జూన్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు మాడుగుల మీదుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపే విధంగా ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడతానని అన్నారు. అంతకుముందు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ మాడుగుల బస్టాండ్ నుంచి మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లు దారిలో మాంసం, చేపల వ్యర్థాలను వేయడంతో ఆలయానికి వెళ్లే భక్తులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే బండారు జాతర పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, టీడీపీ మండల అధ్యక్షుడు జగ్గారావు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో కొంకి అఅప్పారావు, డీఎల్‌పీవో, సీఐ పైడిపునాయుడు, ఎస్ఐ నారాయణరావు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, పైడియ్యనాయుడు, శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): పినకోట ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు గురువారం తెలిపారు. వాలాబు, శ్రీరాంపురం, అనంతగిరి మండలకు చెందిన జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీల పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే బి.కింతాడ సబ్‌స్టేషన్‌లో రెండు గంటల పాటు సరఫరా నిలిపివేస్తామన్నారు.

అన్నవరంలో కొళాయిలు ప్రారంభం

చోడవరం, మే15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని అన్నవరంలో ఇంటింటికీ కొళాయి పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నారాయణరావు, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి చిన్న, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి

దేవరాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) తమకు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానిక మోడల్ కాలనీ వాసులు సచివాలయ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. జలజీవన్ మిషన్ కింద రెండు నెలల కిందట ఇంటింటికీ కుళాయిల నీరందించి, అనంతరం సరఫరా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.మోటారుకాలిపోవడంతో సమస్య ఎదుర్కొంటుఉన్నట్టు చెప్పారు.ఇకనైనా సమస్య పరిష్కరించాలని మహిళలు ఫిర్యాదు చేశారు.

రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ

బుచ్చెయ్యపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): కేపీ అగ్రహారంలో రైతులకు పీఎస్‌పీ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఉచితంగా మామిడి, జీడి, టేకు అందించనున్నట్టు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వివరాలను ఈనెల 19న సచివాలయానికి అందజేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి


రైతులకు నవధాన్యాలను అందిస్తున్న దృశ్యం

రోలుగుంట, మే 15(ఆంధ్రజ్యోతి) : ఈ ఖరీఫ్‌లో రైతులందరూ పీఎండీఎస్ నవధాన్యాలు వేసి ప్రకృతి వ్యవసాయం చేయాలని డివిజనల్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని జానకిరాంపురంలో గ్రామ సభను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్‌లో ప్రతీ రైతు తన వివరాలను ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు అందజేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడులను సాధించిన రైతులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు, వీఏఏ సాయికుమార్, సీసీ కనకమహాలక్ష్మి, మండల ఇన్‌చార్జి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ తప్పుల సవరణకు తహసీల్దార్‌కు అధికారం

రావికమతం,మే 15 (ఆంధ్రజ్యోతి):అన్నదాత సుఖీభవ పథకానికి లబ్ధి, రైతులకు చెందిన భూ తప్పుల సవరణకు తహసీల్దార్‌కు అధికారం ప్రభుత్వం ఇచ్చినట్టు ఏవో డి. రూప తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవిన్యూ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. అన్న దాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులు లబ్ధికి ఆధార్ నంబరురైతు పాసుపుస్తకం బ్యాంకు ఖాతాకు లింక్ అయి ఉండాలన్నారు.

సమన్వయంతో సంస్థాగత ఎన్నికలు

- టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

చీడికాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. స్థానిక తులసీ కల్యాణ మండపంలో గురువారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వం తీసుకున్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు పరిహార బీమా అందుతుందన్నారు. అలాగే, పార్టీ మండల అధ్యక్ష స్థానానికి చీడికాడకు చెందిన పోతల చిన్నంనాయుడు, శిరిజాం గ్రామానికి చెందిన పంచాడ దాలెం నాయుడులు ఎన్నికల్లో పోటీకి ఈ సందర్భంగా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ పోటీ చేస్తున్న అభ్యర్థులకు 70శాతంకంటే ఎక్కువ ఓట్లు వస్తే అధ్యక్షుడిగా ఇక్కడే ప్రకటిస్తామని, లేకుంటే రాష్ట్ర కమిటీకి నివేదిస్తామన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వాసురెడ్డి ఏసుబాబు, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులను ఒకొక్కరిగా పిలిచి తమ అభిప్రాయాలను నమోదు చేశారు. పెండింగ్‌లో ఉన్న బైలపూడి, వరహాపురం, కోనాం గ్రామ కమిటీలను ఇరువర్గాలకు సర్దిచెప్పి కమిటీని ఏకగ్రీవం చేశారు. మరో రెండు కమిటీలను వాయిదావేశారు. పార్టీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు కుచ్చు కళావతి, పోతల రమణమ్మ, పి.సత్యవతి, టీడీపీ మండల కమిటీ సభ్యులు రెడ్డి సన్యాసినాయుడు, గండి ముసలినాయుడు, రెడ్డి రాము, గండి లక్ష్మి, పేరపు కొండబాబు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- రావికమతంలో పిడుగుపాటుకు 16 మూగజీవాలు మృతి


మృతిచెందిన మేకలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం,మే 15 (ఆంధ్రజ్యోతి): పిడుగు పడి 16 మేకలు, గొర్రెలు మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మరుపాకకు చెందిన కాపరులు రావికమతం శెట్టి వారి పొలాల వద్ద మేత (పశుగ్రాసం) కోసం మేకలు, గొర్రెలను తోలుకు వచ్చారు. వీటిపై సాయంత్రం వర్షంతోపాటు పిడుగు పడింది. ఈ ప్రమాదంలో నమ్మి వెంకట స్వామికి చెందిన ఐదు మేకలు, శీరా సాంబకు చెందిన మూడు గొర్రెలు, శీరా వెంకటరమణకు చెందిన నాలుగు మేకలు, దేవర అప్పల నాయుడుకు చెందిన రెండు మేకలు, కేబీపీ అగ్రహారానికి చెందిన దేవర అప్పారావుకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. మరో రెండు గొర్రెలు స్వల్ప గాయాలతో తప్పాయి. ఈ మూగ జీవాల విలువ సుమారు రూ. 5లక్షలు ఉంటుదని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు మూగ జీవాల యజమానులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వంనుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జి.కోటేశ్వరావు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపిటీసీ గంజి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టవానిపాలెంలో పాడి ఆవు మృతి

మట్టవానిపాలెంలో షైచర్ల విశ్వనాథం పశువుల షెడ్‌పై పిడుగు పడి ఒక పాడి ఆవు మృతి చెందింది. రూ.60 వేల విలువ ఉంటుంది.

సత్యవరంలో ఈదురుగాలుల బీభత్సం

మాడుగుల రూరల్: మండలంలోని సత్యవరంలో గురువారం ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. చెట్లు, రేకుల షెడ్‌లు, తాటాకుల పాకలు, సుమారు 20 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు నేలకొరిగాయి. జంపెన, వీరనారాయణంలలో పలు చోట్ల విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. సత్యవరం గ్రామంలో పెళ్లికి వేసిన టెంట్లు, మొత్తం వేదికలు కుప్పకూలాయి.

గంధవరంలో ఆవు మృతి

చోడవరం:మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గంధవరంలో సాయంత్రం పిడుగుపడి యలమంచిలి నానాజీ చెందిన ఆవు మృత్యువాతపడింది. బాధితుడిని ఆదు కోవాలనిడీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నరసింగరావు ప్రభుత్వాన్ని కోరారు.

మాడుగులలో వర్షం

మాడుగుల:మాడుగుల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. గత వారంరోజులుగా ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. ఈ వర్షంతో ఉప శమనం పొందారు.

కె.కోటపాడు: కె.కోటపాడుతోపాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం రెండు గంటల పాటు తేలికపాటి వర్షం కురిసింది.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలపునకు చర్యలు తీసుకుంటున్న స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. గురువారం రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములపై వీఆర్వోలు సర్వే నిర్వహించాలన్నారు. ఆక్రమణలో ఉన్న వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే వారసత్వ భూముల మ్యుటేషన్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కుల, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ యాత్రను వినియోగించుకోవాలి: కలెక్టర్

పాడేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం (ఐఆర్‌సీటీసీ సంయుక్తంగా భారత్ గౌరవ్ ట్రైన్ యాత్ర పేరిట వేసవి ప్రత్యేక టూరిస్ట్ రైల్ టూర్ ప్యాకేజీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్యాకేజీలద్వారా భారతదేశంలో ఉన్న ప్రధాన టూరిస్ట్, యాత్రికుల ప్రదేశాలు అన్నీ చూడవచ్చన్నారు. ఈ ప్రత్యేక రైలు హైదరాబాద్ నుంచి బయలుదేరుతాదన్నారు. ఈ యాత్రికులకు అవసరమైన చోట్ల బస్సు ప్రయాణం, వసతి సౌకర్యం, ఆహార సదుపాయం, గైడ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణీకులకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఆ సక్తిగల జిల్లా ప్రజలు, యాత్రికులు ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్‌లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. టూర్ ప్యాకేజీ వివరాలు, యాత్ర ప్రారంభ తేదీలు యాత్ర ప్రదేశాల వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలన్నారు. ఇతరవివరాలకు ఫోన్లు: 040-27702407, 9701360701 సంప్రదించాలని తెలిపారు.

20న సమ్మె విజయవంతం చేయాలి



కార్మికులకు లేబర్ కోడ్ రద్దు పుస్తకాలందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధనకు ఈనెల 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రి కార్మికులకు లేబర్ కోడ్ రద్దు పుస్తకాలు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాల పరిరక్షణకు దేశ వ్యాప్త బంద్‌లో ప్రతి కార్మికుడు పాల్గొని కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రహిమాన్, అర్జున్, పార్వతమ్మ, సతీశ్ పాల్గొన్నారు.

అభ్యంతరం లేని భూ నివాసితులకు జీవో 30 వర్తింపు

జి.మాడుగుల, మే 15 (ఆంధ్రజోతి) : 2019 అక్టోబరు 15 ముందు అభ్యంతరాలు లేని స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులకు జీవో 30 ద్వారా ప్రభుత్వం రెగ్యులైజేషన్ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్టు స్థానిక తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని వీఆర్వో, ఆర్ఐ సర్వే విచారణ అనంతరం అర్హులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. సందేహాలకు స్థానిక వీఆర్వోని సంప్రదించాలని సూచించారు.

నేడు పాడేరులో ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సదస్సు

అరకులోయ, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో నోటిఫై చేసిన ఉపాధ్యాయపోస్టులను ఏజెన్సీలో మినహాయించి ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ తీయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. దీనిపై కార్యాచరణకు శుక్రవారం పాడేరులో సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. గురువారం కమిటీ కన్వీనర్ ఎం.రమేశ్‌కుమార్, కో-కన్వీనర్లు కొర్రా శ్యామ్, కిల్లోదాసు, అడకట్ల అబి, గెజ్జెల పురేశ్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీలో తమ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ప్రకటన ఆదివాసీ ఉద్యోగాలపై ప్రకటన జారీ చేశారు. దీనిపై మరింత స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీనుంచి ఆదివాసులకు 100శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని స్పష్టం చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్టులు ఆదివాసీలతోనే భర్తీ చేయాలన్నారు. ఈమేరకు నెల 16 వతేదీన పాడేరులతో జరిగే సమావేశంలో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా సంఘాలతోపాటు డీఎస్సీ అభ్యర్థులంతా పాల్గొని భవిష్యత్ కార్యచరణ రూపొందించాలని పిలుపు నిచ్చారు.

వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గూడెంకొత్తవీధి, మే 15 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందేందుకు నిరుద్యోగ గిరిజన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రిటైల్ సేల్స్ అసోసియేట్, సీనియర్ అ సోసియేట్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (కంప్యూటర్) కోర్సుల్లో శిక్షణ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు ఫోన్: 6302636174కు కాల్ చేయాలన్నారు.

యథేచ్ఛగా పశువుల సంచారం.. వాహనదారులకు తిప్పలు

» కొయ్యూరు మండలంలో ప్రధాన మార్గాల్లో సమస్య

కొయ్యూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పశువుల మందలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ముఖ్యంగా ఈ పశువులు ప్రధాన రహదారి పొడవునా రాత్రి, పగలు తేడా లేకుండా తిరుగాడుతుండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జనవరినుంచి ఏటా ఈ ప్రాంతంలో పశువులను బహిరంగంగా విడిచిపెట్టడం గత కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఈ పశువులు మందలు తిరుగుతూ ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై ఈ మందలు చేరి సేదతీరుతున్నాయి. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే పలువురు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. గతంలో ఈ రహదారిపై రాత్రి వేళల్లో వాహన రాకపోకలు పరిమితంగా ఉండేవి. ప్రస్తుతం ఈ రహదారి 516 ఈ జాతీయ రహదారిగా రూపాంతం చెందటంతో వాహనాల సంఖ్య పదిరెట్లు పెరిగింది.



నడింపాలెం సమీప జాతీయ రహదారిపై పశువుల మంద

దీంతో ఈ పశువుల మందలు ఒక్కో సారి ఆకస్మికంగా వాహనాలకు అడ్డుగా పరుగులు తీస్తున్నాయి. వీటిని తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు పశువుల మందలను నియంత్రించేలా పంచాయతీలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తిరంగ ర్యాలీని జయప్రదం చేయాలి

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి ఈశ్వరి



టీడీపీ పాడేరు ఇన్‌చార్జి ఈశ్వరి

పాడేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 17వ తేదీ శనివారం నిర్వహించనున్న తిరంగా ర్యాలీని కూటమి, నాయకులు, ప్రజలు విజయవంతం చేయాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. పాకిస్థాన్ ముష్కరులు పెహల్గాంలో పర్యాటకులపై చేసిన దాడికి ప్రతి దాడిగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి తగిన గుణపాఠం చెప్పిందన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను, పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను అప్పగించేంత వరకు ఆపరేషన్ సిందూరు కొనసాగుతూనే ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో 17వ తేదీ శనివారం పాడేరులో తిరంగ ర్యాలీని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు దూరం

» పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లులేక అవస్థలు



పని ప్రదేశంలో కనీసం టెంట్ లేని దృశ్యం

డుంబ్రిగుడ, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పథకం పనులు జోరుగా జరుతున్నాయి. అయితే, ఎండల తీవ్రత కూలీలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పని చేస్తున్న చోట్ల కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గతంలో పనిప్రదేశాల్లో కనీసం టెంట్‌లు, తాగునీటి సౌకర్యాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం స్పందించి ఇకనైనా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

గిరిజన మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత



శిక్షణలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కాంతమ్మ

పాడేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడ్డాకుల కుట్టు , ప్లేట్ల తయారీతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్టు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ అన్నారు. మండలంలోని వంజంగి పంచాయతీ కేంద్రంలో వంజంగి, బొర్రమామిడి, వి.కొత్తూరు గ్రామాలకు చెందిన మహిళలకు సీపీఎఫ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అడ్డాకుల ప్లేట్ల తయారీపై మూడు రోజులు అందించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీప అటవీ ప్రాంతంలో లభించే అడ్డాకులతో ప్లేట్ల తయారీతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించ వచ్చని అన్నారు. అనంతరం సీపీఎఫ్ సేవా సంస్థ అధ్యక్షురాలు ఆచార్య నాగమణి మాట్లాడుతూ వంజంగి పంచాయతీలో ఇంత వరకు సంస్థ నుంచి మహిళా గ్రూపులు ఆర్థికాభివృద్ధికి పిండి మిల్లులు, చిరుధాన్యాల ప్రొసెసింగ్ మిల్లులు, అడ్డాకులు కుట్టు మిషన్‌లు, ప్లేట్ల తయారీ మిషన్‌లు అందించామన్నారు. పుట్టగొడుగుల పెంపకం తదితర ఆర్థికంగా లబ్ధి చేకూరే పథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌దన్ నుంచి శిక్షకులు చిన్నమ్మలు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడండి

» బీసీవై నేత రాజన్



బీసీవై పాడేరు ఇన్‌చార్జి కిల్లో రాజన్

జి.మాడుగుల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో అధిక వడ్డీ వ్యాపారులు గిరిజనులకు మోసాలకు పాల్పడుతున్నారని, వీరిని నిరోధించాలని బీసీవై పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి కిల్లో రాజన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చాలా కాలంగా మైదాన ప్రాంతాలకు చెందిన వడ్డీ వ్యాపారులు ఈ ప్రాంతాల గిరిజనులకు వారపు వడ్డీల పేరుతో రుణాలు అందిస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించి అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా చిరు వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలకు లక్ష్యంగా చేసుకుని ఈ వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. వారి వేధింపులకు కుటుంబాల్లో ఆశాంతి నెలకొంటుందని గిరిజనులు వాపోతున్నట్టు చెప్పారు. వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను రాజన్ కోరారు.

రెండవ రోజుకు చేరిన జేఏసీ రిలే నిరాహార దీక్షలు

పాడేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాల చట్ట సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో జేఏసీ నాయకులతో పాటు అన్ని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర మాట్లాడుతూ ఆదివాసీలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం గిరిజన సలహామండలిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, 2025 మెగా డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించి, షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డి మాండ్ చేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక చట్టాలు, హక్కులు ఉ న్నాయని వాటిని పరిగణలోకి తీసుకొని గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర



రిలే దీక్షల్లో పాల్గొన్న జేఏసీ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

ప్రధాన కార్యదర్శి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం, జీఎస్‌యూ నాయకులు బి.మాధవరావు, వివిధ సంఘాల నాయకులు ఎం.ప్రసాదరావు, బి.రాజుబాబు, ఎంవీ రమణ, పి.సురేశ్, నాగరాజు, రవి, చిన్నమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

గోతులమయంగా ప్రధాన రహదారి

ముంచంగిపుట్టు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మధ్య చోటాముఖిపుట్టు సమీపంలో వంతెన ముందు భారీ గోతులతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. భారీ వర్షాలకు సుమారు రెండేళ్ల క్రితం దెబ్బతిన్నఈ రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస దృష్టిసారించలేదు. ఫలితంగా బ్రిడ్జి వద్ద రహదారి ప్రమాదాలకునిలయంగా మారింది. ఈ గోతుల్లో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత మూడు నెలల వ్యవధిలో సుమారు 20 ద్విచక్ర వాహనాలు ఆ ప్రదేశంలో అదుపు తప్పాయి. పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలయ్యారు. అయినా, సం బంధిత అధికారులు స్పందించకపోవడంతో ఇటీవల ఆ పరిసర గ్రామాల యువకులు శ్రమదానంతో రహదారిపై గుంతలను పూడ్చారు. అయితే గత వారం రో జులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారి పూర్వస్థితికి వచ్చింది. ఈ ప్రదేశంలో రహదారి ఇరువైపులా డ్రైనేజీ లేక వరదనీరు రహదారిపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో కోతకు గురైంది. పలు చోట్ల గుంతలు పడ్డాయి. ఆ గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు వాహన చోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాల ప్రజలు ఇటుగా



చోటాముఖిపుట్టు సమీపంలో కోతకు గురైన ప్రధాన రహదారి

నిత్యం వాహన రాకపోకలు సాగిస్తుంటారు. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సమావేశ మందిరం లేక ఆశ కార్యకర్తల అవస్థలు

పెదబయలు పీహెచ్‌సీలో ఆరుబయట సమావేశాలు

పెదబయలు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశ మందిరం లేక ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో కుంతుర్ల, కిముడుపల్లి, పెదకోడపల్లి, గంపరాయి, అరడకోట, సీకరి, సీతగుంట, అడుగులపుట్టులలో 157 మంది ఆశ కార్యకర్తలు, 17 మంది సీహెచ్‌డబ్ల్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికీ ప్రతీ నెలా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. అయితే, పీహెచ్‌సీలో సమావేశ మందిరంలేక ఆస్పత్రి



సీతగుంట బోయ్స్-1 ఆశ్రమ పాఠశాల డైనింగ్ హాల్‌లో ఆశలు(ఫైల్)



పెదబయలు పీహెచ్‌సీ బయట ఎండలో ఆశ కార్యకర్తల సమావేశం

ఎదుట సీసీ రోడ్డుపైనే టెంట్‌లు వేసుకుని సమావేశం కొనసాగిస్తున్నారు. వర్షకాలంలో శిథిలావస్థకు చేరిన పాత ఆస్పత్రి భవనం లేదా స్థానికంగా ఉన్న ఏదో ఒక ఆశ్రమ పాఠశాల విద్యార్థుల భోజన శాలల్లో సమావేశం కొనసాగిస్తున్నారు. ఈస్థితిలో మీటింగ్ హాల్ నిర్మించాలని గతంలో స్థానిక వైద్యాధికారి ద్వారా ఎంపీడీవో, డీఎంహెచ్‌వో, కలెక్టర్ విన్నవించారు. ఎంపీడీవో వచ్చి పీహెచ్‌సీ ఆవరణలో కొలతలు వేసి ఆ తర్వాత పట్టించుకోలేదని ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూవోలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నాబార్డు సహకారంతో ఉద్యాన పంటల సాగు

» డీడీఎం గౌరీశంకర్



అరకు ఎంపీ తనూజారాణికి వినతిపత్రం అందస్తున్న సీలేరు నాయకులు

చింతపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో నాబార్డు ఆర్థిక సహకారంతో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) వి. గౌరీశంకర్ అన్నారు. గురువారం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సాంకేతిక సహకారం అందిస్తున్న గిరిజన వికాస్, మన్యసీమ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రాంతీయ కార్యాలయాలను ఆయన సందర్శించారు. ఎఫ్‌పీవో సీఈవో, డైరెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీడీఎం మాట్లాడుతూ జిల్లాలో నాబార్డు ద్వారా రూ.400కోట్ల ఆర్‌డీఎఫ్ నిధులతో 440 ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా గిరిజన రైతులు ఉద్యాన పంటల సాగుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని ఎఫ్‌పీవోలకు అందజేస్తున్నట్టు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగు విస్తరణలో ఏడు ప్రాజెక్టులు అమలులో ఉన్నాయన్నారు. ఐదు వేల ఎకరాల్లో రైతులు పలు రకాల ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారని, ఈపంటల ద్వారా రైతులు ఆదాయం పొందుతున్నారన్నారు. ఎఫ్‌పీవోలకు రూ.5కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. కాఫీ, మిరియాలు, పసుపు పంటలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసేందుకు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. అలాగే చింతపల్లి వందపడకల ఆస్పత్రితోపాటూ 2,290 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులకు నాబార్డు ఆర్థిక సహాయం అందిస్తోందని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో పూర్వ డీడీఎం చక్రధర్, మన్యసీమ, మాతోట సీఈవోలు శ్రీనివాసరావు, చిన్నారావు, రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్వీనగర్- పాలగెడ్డ రహదారిని బాగు చేయాలి



అరకు ఎంపీ తనూజారాణికి వినతిపత్రం అందస్తున్న సీలేరు నాయకులు

సీలేరు, మే 15, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి వై. రామవరం మండలం పాలగెడ్డ వరకు గల అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ సీలేరుకు చెందిన నాయకులు అరకు ఎంపీ తనూజారాణిని కోరారు. ఈ సందర్భంగా గురువారం పాడేరులో ఆమెను కలసి అధ్వానంగా మారిన ఆర్వీనగర్- పాలగెడ్డ రోడ్డుతో ఈప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గత 12 సంవత్సరాలుగా ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు చేపట్టక ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 8 న జీకేవీధి మండలంలో సంభవించిన తుఫాన్ ధాటికి మరింత దారుణమంగా మారిందని, అప్పట్లో నెల రోజులకు పైగా జీకేవీధి నుంచి సీలేరుకు పూర్తిగా రాకపోకలు కూడా నిలిచిపోయాయని తెలిపారు. రాకపోకలు పునరుద్ధరణకు తాత్కాలిక చర్యలు మాత్రమే ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టి చేతులు దులుపుకున్నట్టు ఆరోపించారు.ఈ రహదారి నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్టు గత జనవరి నుంచి అధికారులు ప్రకటించినా రోడ్డు పనులు ఇప్పటికీ ప్రారంభించలేదని వివరించారు. గర్భిణులు, అత్యవసర రోగులు వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ రహదారి నిర్మాణం చేపట్టేలా చూడాలని ఎంపీకి వారు వినతిపత్రమందించారు. ఈ కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ పి దుర్గో, మాజీ వైస్ సర్పంచ్ కారే శ్రీనివాస్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్ పనిచేయక ఇక్కట్లు



మాదిమళ్ళు గ్రామంలో ఎయిర్ టెల్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సీలేరు, మే 15 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మాదిమళ్ల గ్రా మంలో గత వారం రోజులుగా ఎయిర్‌టెల్ ఫోన్ సిగ్నల్స్ పనిచేయక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గు రవుతున్నారు. ఫోన్‌లో ఏదైనా సమాచారం బయటకు చేరవేయాలన్నా, ఇతర కార్యకలాపాలకు సమస్య ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అడుగుదామంటే సంబంధిత కంపెనీ సిబ్బంది కూడా అందుబాటులో ఉండడంలేదని గుమ్మిరేవుల పంచాయతీ పెసా కమిటీ అధ్యక్షుడు, మాదిమళ్ల గ్రామస్థులు కొయిలంగి నాగేశ్వరరావు, పరిసర గ్రామాల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయిందా, లేక సిగ్నల్స్ నిలిపి వేసారా ? వివరాలను తెలిపేందుకు ఎవరూ అందుబాటులో ఉండడంలేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి సెల్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంగవరంలో మౌలిక సదుపాయాలు శూన్యం



గంగవరంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

హుకుంపేట మే 15 ఆంధ్రజ్యోతి: మండలంలోని సూకురు పంచాయతీ పరిధి గంగవరంలో మౌలిక సదుపాయాలు లేక గ్రామస్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గ్రామానికి గ్రావిటీ పథకం ద్వారా సమీపంలోని కొండపైనుంచి ఉన్న ఊట గడ్డ నుంచి పైపలను అమర్చారన్నారు. అయితే, ఈ ఊట నీరు వర్షాలు పడితే, కొళాయిలనుంచి బురదతో వస్తోందని, గత్యంతరం లేక ఈ నీటినే వాడాల్సి వస్తోందనివారు పోతున్నారు. ఈ కలుషిత నీటితో వ్యాధులు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి ఉండడంతో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, కొళాయి పైప్ లైన్ కలిసి ఉంటంతో విద్యుదాఘాతానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామానికి రోడ్డు లేక రవాణాకు సమస్య ఎదుర్కొంటున్నారు. కాఫీ, మిరియాలు పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మన్నెం పూల సోయగం



పాడేరు- అరకు మధ్య మన్నెం పూల చెట్టు

డుంబ్రిగుడ, మే 15 (ఆంధ్ర జ్యోతి):మన్యంలో కురుస్తున్న వర్షాలతో కొండ కోనలు పచ్చదనంతో పాటు మన్నెం పూలు ఆకట్టు కుంటున్నాయి. అరకు- పాడేరు జాతీయ రహదారికి ఆనుకుని చెట్ల ఎర్రని, నీలిరంగు కలగలిసిన చంగావు వర్ణంలో దర్శనమిస్తున్నాయి. అరకు ప్రకృతి అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు చెట్లను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

రహదారుల నిర్మాణంతో పారిశ్రామిక ప్రగతి

▸ భూములు ఇచ్చిన రైతులకు టీడీఆర్ బాండ్లు ▸ వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

సబ్బవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణం వల్లే ఏ ప్రాంతమైన పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని వీఎం ఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. మండలంలోని అసక పల్లి-లంకెలపాలెం రోడ్డు నుంచి పైడివాడఅగ్రహారం, పీతపాలెం మీదుగా అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో గల ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కు వరకు వీఎంఆర్‌డీఏ నిర్మించ నున్న 100 అడుగుల రోడ్డుకు సేకరించిన భూములను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లంకెలపాలెం రోడ్డు నుంచి పైడివాడ అగ్రమారం, పీతపాలెం మీదుగా కోడూరుకు రోడ్డును 2.68 కిలోమీటర్లు మేర 100 అడుగుల వెడల్పు(30 మీటర్లు)న నిర్మించేందుకు 12.263 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. రోడ్డు నిర్మాణానికి


రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

భూములు ఇచ్చిన రైతులకు పరిహారంగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు జారీ చేస్తామన్నారు. రోడ్డు విస్తరణ వలన ఈ ప్రాంతం అంతా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుం దన్నారు. కోడూరులో ఆటోనగర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. అందులో ఎంఎస్ ఎంఈ యూనిట్లు, మరోవైపు మహిళా పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కోసం ఔత్సాహికులు పోటీ పడుతున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగు పడడంతో కొత్త కళ వచ్చిందని చెప్పారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ఇంకా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డు విస్తరణకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్. అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేవుడు, ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అక్కిరెడ్డి రామలక్ష్మీ, దుర్గినాయుడు, బొబ్బరి మహేశ్, అమ్మతల్లి, సత్యారావు, సన్యాసినాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కాలువలు, చెరువుల అభివృద్ధికి రూ.2.87 కోట్లు మంజూరు

▸ ఇరిగేషన్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే కొణతాల వెల్లడి
▸ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం


ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ద్వారా కాలువలు, చెరువుల అభివృద్ధికి రూ.2.87 కోట్ల నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే కొణతాల రామ కృష్ణ తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న ఇరిగేషన్ కాలువలు, చెరువుల అభివృ ద్ధిపై గురువారం ఆయన ఇరిగేషన్ డీఈ స్వామినాయుడు, ఏఈ అమూల్యతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనకాపల్లి, కశింకోట మండలాల్లో ఉన్న కాశీమదుం చానల్‌కి రూ. తొమ్మిది లక్షలు, పేరంటాలపాలెం చానల్‌కు రూ.ఆరు లక్షలు, సీతానగరం చానల్‌కు రూ.10 లక్షలు, తగరంపూడి చానల్‌కు రూ.ఆరు లక్షలు, వెదురుపర్తి చానల్‌కు రూ.ఆరు లక్షలు, తుమ్మపాల చానల్‌కు రూ.10లక్షలు, మాకవరం ఎర్రినాయుడు చానల్‌కు రూ.10 లక్షలు, సంతపాలెం వీరన్న ట్యాంకుకు రూ.10 లక్షలు, సిహెచ్.ఎన్.అగ్రహారం ధర్మసాగరం ట్యాంకుకు రూ.10 లక్షలు, భట్లపూడి ఎర కన్న ట్యాంకుకు రూ.10 లక్షలు, రేబాక ఊర ట్యాంకుకు రూ.తొమ్మిది లక్షలు మం జూరు చేసినట్టు చెప్పారు. అంతేకాకుండా జీవీఎంసీ అనకాపల్లి పరిధిలో ఉన్న పదకొండు మురుగునీటి కాలువల్లో పూడిక తొలగింపునకు పులికాలువకు రూ.28 లక్షలు, సిహెచ్.ఎన్.అగ్రహారం వెదుళ్ల గడ్డ రూ.29.3 లక్షలు, కొండుపాలెం పాతు కొండ గెడ్డకు రూ.18.2లక్షలు, కొప్పాక గైరమ్మగెడ్డకి రూ. ఆరు లక్షలు, దిబ్బపాలెం గ్రామం చెర్లోపలి చానల్‌కు 9.95 లక్షలు, ఎల్లయ్య చానల్‌కు రూ.10లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా నీటి పారుదల శాఖ పరిధిలో ఇంకా చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వేకువజామున విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నాయకులు పోలారపు త్రినాథ్, బొడ్డపు ప్రసాద్, పైలా గోపి, మజ్జి చిట్టి, స్వర్ణకా రుల సంఘం అధ్యక్షుడు బాబీలతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, మద్దాల కూర్మారావు, వేల్పులవీధి పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాలుగేళ్ల చిన్నారి అదృశ్యం


లోహిత

కొత్తూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్ట ణంలోని మళ్లవీధికి చెందిన నాలుగేళ్ల చిన్నారి భీశెట్టి లోహిత అదృశ్యంపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. బాలిక తల్లిదండ్రులు గంగునా యుడు, లలిత. తండ్రి అనకాపల్లిలోని ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సెక్యూ రిటీ గార్డుగా, తల్లి కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తు న్నారు. వీరికి జానుప్రియ, లోహిత అనే ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారు. వీరిద్దరూ తల్లిదండ్రులు పనుల నుంచి వచ్చేంత వరకు ఇంటివద్దే ఆడుకుంటారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు పనికి వెళ్లి సాయంత్రం ఆరు గంట లకు తిరిగి వచ్చేసరికి చిన్న కుమార్తె లోహిత కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకి తెలియరాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఎస్ఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సబ్బవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ లను రద్దు చేసి, కార్మిక సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ పంచాయతీ కార్మికులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను అంతా విజ యవంతం చేయాల్సిందిగా ఆమె కోరారు.

ఘనంగా ముత్యమాంబ, మరిడిమాంబ వేడుకలు


వెదుళ్లనరవలో పూజలందుకున్న ముత్యమాంబ

సబ్బవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్లనరవలో ముత్యమాంబ అనుపోత్సవాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం మేళతాళాలు, తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీ, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించిన అనంతరం ఆలయం ఆవరణలో అనుపోత్సవాన్ని జరిపారు. వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపల్లి ఎన్నాజీ, గ్రామ పెద్దలు ఉరుకూటి శ్రీను, చొప్పా కనకరాజు, ఎర్నిబాబు, ఒమ్మి రాము తదితరులు దర్శించుకున్నారు.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం : లంకెలపాలెం పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఘటాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరి పారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయ కులు కోటేశ్వరరావు, సుందరపు అప్పారావు, కర్రి అ ప్పారావు, రౌతు మూర్తి, రామారావు, శంకరరావు, నాయుడు, సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

మారేడుపూడిలో...

అనకాపల్లి రూరల్ : మండలంలోని మారేడు పూడిలో మరిడిమాంబ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి


లంకెలపాలెంలో విశేష అలంకరణలో మరిడిమాంబ

స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సాలాపు కనకరాజుతో పాటు జనసేన గ్రామ అధ్యక్షుడు మాడిసా వినోద్ తదితరులు పూజలు జరిపారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాదపు రాంబాబు, ఈగల వెంకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జోన్ ఆర్‌వోగా రమణ


కె.రమణ

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ రెవెన్యూ అధికారిగా, సూప రింటెండెంట్‌గా కె.రమణ నియమి తులయ్యారు. ఇప్పటి వరకు ఈ రెండు పదవుల్లో ఈయన ఇన్‌చా ర్జిగా వ్యవహరించారు. గాజువాక జోన్‌లో పనిచేస్తున్న ఇతనిని అన కాపల్లికి పూర్తిస్థాయి అధికారిగా నియమిస్తూ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు గురువారం జోనల్ అధికారులు తెలిపారు.

చల్లబడిన వాతావరణం

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉష్ణతా పంతో అల్లాడుతున్న అనకాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు గురువారం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసా గింది. 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. దీనికితోడు వడగాల్పులు మరింత ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. పట్టణవాసులతో పాటు వివిధ పనులపై ఇక్కడికి విచ్చేసిన వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. చిరుజల్లులు కువరడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది.

అనకాపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు మెరుగైన చర్యలు

▸ సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం
▸ ట్రాఫిక్ విభాగంలో సంస్కరణలకు కీలక సూచనలు

అనకాపల్లి ట్రాఫిక్ విభాగంలో సంస్కరణల దిశగా కీలక సూచనలు

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేష న్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లిలోని ట్రాఫిక్ తదితర అంశాలపై ఆరా తీసి కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం ప్రజలకు కనిపించేలా విజిబుల్‌గా ఉండాలని ఆదే శించారు. వాహనాల రద్దీ నివారణకు అనువైన పార్కింగ్ స్థలాలను గుర్తించా ల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో భాగంగా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రధాన జంక్షన్ల వద్ద మైక్‌ల ద్వారా హెచ్చరికలు చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని సూచిం చారు. ఇదే క్రమంలో ట్రాఫిక్ పర్యవేక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విని


ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

యోగించుకోవాలని వివరించారు. ప్రధాన జంక్షన్లలో సీసీ టీవీ కెమెరాలు అమర్చి నిఘా కొనసాగించాలన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బాల సూర్యారావు, ఎస్ఐ శేఖరం పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జీలను కలిసిన ఎస్పీ తుహిన్‌సిన్హా


జిల్లా న్యాయమూర్తులకు పుష్ప గుచ్ఛమందిస్తున్న ఎస్పీ

చోడవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ అద నపు జిల్లా కోర్టు జడ్జి కె. రత్నకుమార్, 4వ అదనపు జిల్లాకోర్టు జడ్జి ఎం. నాగేశ్వరరావును జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కోర్టు సముదాయాన్ని సందర్శించిన ఎస్పీ అనంతరం జడ్జీలను ఇటీవల జిల్లా పరిధిలోని గంజాయి అక్రమ రవాణా కేసులు, హత్య కేసుల వంటి ప్రధాన నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలను వివ రించారు.

ఎస్ఈజడ్‌లో కస్టమ్స్ అదనపు కార్యాలయం ప్రారంభం

▸ ముఖ్య అతిథిగా సెజ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి హాజరు

పరవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఫార్మా సిటీకి ఎదురుగా గల సెజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కస్టమ్స్ అదనపు కార్యాలయాన్ని స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిష నర్ (విశాఖపట్నం) రోష్ని అపరంజి కొరారి గురు వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తిస్థాయి మౌలిక వసతులతో ఇక్కడ అదనపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తు అవసరాలకు ఎంతగానో ఇది ఉపయోగపడతాదన్నారు. విశాఖ ఫార్మాసిటీ యాజమాన్యానికి ఆమె అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎకనామిక్ జోన్ డి ప్యూటీ కమిషనర్లు ఎస్‌జెఎన్‌హెచ్‌కే వరప్రసాద్ వర్మ, శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.రమ్య, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం (ఫైనాన్స్


కస్టమ్స్ అదనపు కార్యాలయం ప్రారంభోత్సవంలో రోష్ని అపరంజి కొరారి తదితరులు

విభాగం) సత్యంనాయుడు, హెచ్ఆర్ అండ్ అడ్మిన్ విభాగం డీజీఎం గిరిధర్‌రావుభక్షి, పలు పరిశ్రమ ల ప్రతినిధులతో పాటు వివిధ విభాగాల అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు గురు వారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సు, ఒకేషనల్ కోర్సులకు మ్యాథ్స్-1బి, జువాలజీ-1, హిస్టరీ పరీక్షలకు 5946 మంది హాజరుకావాల్సి ఉండగా, 5743 మంది పరీక్షలు రాశారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవ త్సరం జనరల్ కోర్సు, ఒకేషనల్ కోర్సులకు మ్యాథ్స్-2బి, జువాలజీ, హిస్టరీ-1 పరీక్షలకు 1463 మందికి 1389మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుజాత తెలిపారు.

సమన్వయంతో సంస్థాగత ఎన్నికలు : బత్తుల

చీడికాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. స్థానిక తులసీ కల్యాణ మం డపంలో గురువారం కార్యకర్తలతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు పరి హార బీమా అందుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వాసురెడ్డి ఏసుబాబు, మాజీ ఎంపీపీలు కుచ్చు కళావతి, పోతల రమణమ్మ, సత్యవతి, మండల కమిటీ సభ్యుడు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభానికి మరమ్మతులు


మరమ్మతులు చేపట్టిన స్తంభం అడుగు భాగం

పరవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీ పంలో ప్రధాన రహదారికి ఆనుకొని ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ స్తంభానికి అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. స్తంభం అడుగు భాగం శిథిలమై ఇనుప చువ్వలు బయటకు కనిపించేవి. ఎప్పుడు కూలిపోతుం దోనని స్థానికులు భయాందోళన చెందుతు న్నారు. దీంతో 'గాలి వీచినా... వాన కురిసినా... వణుకే' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' కథ నాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందిం చిన సదరు అధికారులు శిథిలమైన స్తంభం అడుగుభాగంలో సిమెంట్ పిక్క కలిపి మర మ్మతులు చేపట్టడంతో అక్కడివారంతా ఊపిరి పీల్చుకున్నారు.

శిథిలావస్థకు చేరుకుంటున్న జీవీఎంసీ జోనల్ కార్యాలయ భవనం


అనకాపల్లి జోనల్ కార్యాలయ భవనం

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకా పల్లి జోనల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. శ్లాబులు దెబ్బతినడంతో పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో సిబ్బంది భయాందోళనల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే, గురువారం జనన, మరణ ధ్రువీకరణ విభాగం ముందు వరండాలో శ్లాబ్ నుంచి పెచ్చులు ఒక్కసారిగా పడ్డా యి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లైంది. శ్లాబు ఇనుపచువ్వలు బయటకు కని పిస్తున్నాయి. వీటి చూసినవారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగు తుందోనని హడలిపోతున్నారు. భవనం నిర్మించి ఏళ్ల గడుస్తు న్నందున కొత్త భవనం నిర్మించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.


శ్లాబు నుంచి ఊడిపడిన పెచ్చులు

గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు

▸ అక్రమార్కులను విడిచిపెట్టేది లేదు : తహసీల్దార్ చిన్నికృష్ణ
▸ సీఐ రామచంద్రరావుతో కలిసి సదరు ప్రాంతం పరిశీలన

సబ్బవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయపుర అగ్రహా రంలో బోడిమెట్ట చుట్టూ తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. 'అక్రమా ర్కుల జేబు నింపుతున్న బోడిమెట్ట' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనా నికి ఆయన వెనువెం టనే స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఈ మేరకు సీఐ జి.రామచంద్రరావుతో కలిసి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడిమెట్ట చుట్టూ గ్రావెల్ తవ్విన ప్రాంతాలను పరిశీలించినట్టు చెప్పారు. ఇక్కడ తవ్వకాలు ఎవరు జరిపారు అనే అంశంపై దర్యాప్తు చేపట్టనున్నామన్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అలాగే బోడిమెట్ట వద్ద మున్ముందు తవ్వకాలు జరపకుండా గట్టి నిఘా ఏర్పాటు


తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ

చేస్తున్నట్టు చెప్పారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో రాత్రి వేళ బీటు ఏర్పాటు చేస్తా మన్నారు. తవ్వకాలు జరిపితే వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ఐ వీరయ్య, వీఆర్వో కామరాజు తదితరులు ఉన్నారు.

డెంగీతో జాగ్రత్త సుమా!



పగటి పూట కుట్టే దోమ వల్ల వ్యాధి

- రెండు నుంచి ఏడు రోజుల వరకు తగ్గని జ్వరం
- ఒళ్లంతా తీవ్ర నొప్పులు, కండరాళ్లు, కీళ్ల బాధలు
- తీవ్రమైన తలనొప్పి, చర్మంపై ఎర్రటి మచ్చలు
- ప్లేట్‌లెట్లు పడిపోయే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణుల సూచన

నేడు జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా..

విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

డెంగీ.. భయపెట్టే వ్యాధి. ఏడిస్ ఈజిప్టై అనే ఓ రకం ఆడదోమ పగటిపూట కుట్టడం ద్వారా వ్యాధి సోకుతుంది. రెండు నుంచి ఏడు రోజుల వరకు జ్వరం తగ్గదు. ఒళ్లంతా తీవ్ర నొప్పులు ఉంటాయి. కండరాళ్లు, కీళ్లు బాధిస్తాయి. తట్టుకోలేని విధంగా తలనొప్పి వస్తుంది. చర్మంపై ఎర్రటి మచ్చలు ర్యాస్‌లాగా కనిపిస్తాయి. రక్తంలో ఉన్న ప్లేట్‌లెట్స్ (రక్తకణాలు) పడిపోతాయి. మానవ శరీరంలో ప్లేట్‌లెట్స్ నాలుగు లక్షల వరకు ఉంటాయి. ఇవి వేలల్లోకి పడిపోతాయి పది వేల లోపునకు ప్లేట్‌లెట్స్ పడిపోతే ప్రాణాంతకమవుతుంది. ప్లేట్‌లెట్స్ అనేవి రక్తస్రావం జరగకుండా ఆపే కణాలు. ఇవి తగ్గడం వల్ల శరీరం లోపల భాగాల్లో రక్తస్రావం జరిగి ప్రమాదకర పరిస్థితికి దారితీస్తుంది. అందుకే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



డెంగీ బారిన పడి జ్వరం వచ్చిన వారిని పర్యవేక్షిస్తూ వైద్య సహాయం అందించాలి. శిశువులు, చిన్నపిల్లల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పురుషుల కంటే మహిళలు ఎక్కువ ప్రమాదకర స్థితికి చేరుకుంటారు. మధుమేహం, ఆస్తమా, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి మరీ ప్రాణాంతకం. రోగికి బాగా విశ్రాంతి ఇవ్వాలి. ఐవీ ఫ్లూయిడ్స్ ఇచ్చి బీపీ పడిపోకుండా చూడాలి. వైద్యుల సూచనల మేరకు పారాసిటమల్ మాత్రలు అందించాలి. ఎటువంటి పత్యం అవసం లేదు. తాజాగా, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు అందించాలి. జ్వరం రెండు రోజుల నుంచి ఏడు రోజులలోపు తగ్గిపోతుంది. జ్వరం తగ్గినా తీవ్రమైన కడుపునొప్పి, మలం నల్లగా రావడం, చర్మంలో ఎర్రటి మచ్చలు, ముక్కు నుంచి రక్తస్రావం, ఒళ్లు చల్లబడడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయ కూడదు. వీటిని ప్రమాద సూచికలుగా గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లాలి.

డెంగీషాక్ సిండ్రోమ్

డెంగీలో ఇది మరో రకమైన జ్వరం. శరీరంలో ఫ్లూయిడ్స్ పడిపోవడం, శరీరం లోపల అవయ వాల్లో రక్తస్రావం జరగడం ద్వారా నాడి బలహీనపడుతుంది. దీంతో బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు చల్లబడడం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగీ హేమరేజిక్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్‌లు వచ్చినప్పుడు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించాలి. జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం కాకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. చల్లని నీటితో శరీరాన్ని తుడవాలి. చల్లని ప్రదేశంలో పడుగోబెట్టాలి. తగ్గిన ప్లేట్‌లెట్స్‌ను వైద్యుని సలహా మేరకు ఎక్కించాలి.

డెంగీ హేమరేజిక్ ఫీవర్

డెంగీలో మరోరకం డెంగీ హేమరేజిక్ ఫీవర్. ఇది ప్రమాదకరమైన జ్వరం. శరీరంలో ఏ భాగంలోనైనా అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ముక్కు నుంచి రక్తస్రావం, రక్తవాంతులు, మెదడు, పొట్ట, ఊపిరి తిత్తుల్లో రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తాన్ని గడ్డకట్టించే ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోవడంతో ఈ సమస్య వస్తుంది.

ఆహార నియమాలు

చికిత్సతో పాటు ఆహార నియమాలు పాటించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను అందించాలి. ఫ్లూయిడ్స్ ఎక్కువగా ఇవ్వాలి. ఓఆర్‌ఎస్ ద్రావకం తాగించాలి. మజ్జిగ, కొబ్బరి బొండాం నీళ్ల పట్టించాలి. పండ్ల రసాలు తీసుకోవాలి.

పరిశుభ్రతతోనే నివారణ

చెత్త, చెదారం, మురుగునీరు దోమల ఆవాసాలు. గుట్టలుగా పోసే కొబ్బరి బొండాలు, పాత టైర్లు పడేస్తారు. వర్షాలు కురిసినప్పుడు వీటిలో నీరు నిల్వ ఉంటుంది. దోమలు గుడ్లు పెట్టేందుకు ఇవి అనువుగా ఉంటాయి. ఏడిస్ దోమలు కూలర్‌లు, ఫ్రిజ్ వద్ద పెరుగుతాయి. గృహాల సమీపంలో పరిశుభ్రత లేకపోయినా దోమలు పెరిగేందుకు అవకాశం ఇచ్చినట్టే. వర్షాలు ప్రారంభంకాక ముందే ఇంటాబయటా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

ఇవీ కొన్ని ప్రాథమిక చర్యలు

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు రాకుండా నివారించాలి. కాయిల్స్, లిక్విడ్ లాంటివి వాడాలి. దోమతెరలు వాడితే ఇంకా మంచిది.
- తరచూ జ్వరం వచ్చినంత మాత్రాన డెంగీగా నిర్ధారించలేం. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఇలాగే ఉంటాయి. వ్యాధి నిర్ధారణతోనే చర్యలు తీసుకోవాలి.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో చోడవరం క్రీడాకారులకు పతకాలు

చోడవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఉషు మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో చోడవరంలోని గణేశ్ డిఫెన్స్ అకాడెమీకి చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. 45 కిలోల జూనియర్స్ కేటగిరీలో తేజ స్వరూప్ బంగారు పతకం, మహిళల సీనియర్స్ 60 కిలోల కేటగిరీలో లావణ్య రజత పతకం, 65 కిలోల కేటగిరీలో పాయి లక్ష్మి కాంస్య పతకం సాధించారు. త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. పతకాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్ర ఉషు అసోసియేషన్ కార్యదర్శి నరసింహారావు, వ్యవస్థాపకులు మోహన ముత్యాలరావు, కోశాధికారి వెంకటేశ్‌ల, కోచ్‌గా రమ్య అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో రాష్ట్ర ఉషు అసోసియేషన్ కార్యదర్శి నరసింహారావు

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

విశాఖపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహారం కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కేసులు, బ్యాంక్, మనీ రికవరీ, భూ సేకరణ కేసులు, కార్మిక, కుటుంబ తగాదా కేసులు, పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయసేవా సదన్, న్యాయసేవాధికార సంస్థను గానీ 0891-2560414, 2575046 ఫోన్ నంబర్లను కానీ కాని సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరుల్లో గల మండల న్యాయసేవా సంఘాలను సంప్రతించవచ్చన్నారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

» జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. గురువారం అనకాపల్లి పట్టణం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆధునీకీకరించిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల భద్రత, కుటుంబాల్లో జరిగే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడంలో కౌన్సెలింగ్ సెంటర్ల పాత్ర కీలకమన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ కేంద్రం ద్వారా గృహహింస, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు అందించడమే ముఖ్య లక్ష్యమన్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రజలు డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 2,25,521 మంది యాప్‌లో నమోదయ్యారన్నారు. మొత్తం 177 ఎస్‌ఓఎస్ కాల్స్ వచ్చాయని, ఇందులో ఆరు కుటుంబ సమస్యలకు తక్షణమే చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం ఐదు శక్తి బృందాలు ఏర్పాటయ్యాయన్నారు. ప్రతి బృందంలో ఒక ఎస్‌ఐ, ఐదుగురు సిబ్బంది ఉంటారని, వీరు 78 హాట్‌స్పాట్లు గుర్తించి, 271 సార్లు సందర్శించారన్నారు. ఈ సందర్భంగా 226 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. 39 శక్తి బీట్‌లు ప్రతి రోజు హాట్‌స్పాట్లు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో యాక్ట్, గుడ్‌టచ్ - బ్యాడ్ టచ్, మహిళా చట్టాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.



ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎస్పీ తుహిన్‌సిన్హా

విద్యాసంస్థలలో శక్తి వారియర్స్ గ్రూపులు 985 ఉన్నాయని, 271 కోర్ కమిటీలు ఏర్పాటయ్యాయన్నారు. వీరు విద్యాసంస్థల్లో సమస్యలను గుర్తించి పోలీసులకు తెలియజేస్తారని చెప్పారు. ఎన్టీఆర్ హాస్పటల్ వద్ద ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాధితులకు తాత్కాలిక ఆశ్రయం, వైద్య, చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్ సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, అప్పలనాయుడు, బాల సూర్యారావు, వెంకటనారాయణ, ఎస్‌ఐలు శిరీష, యమునా, అలీ షరీఫ్, శేఖరం, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

టార్గెట్ మలేరియా

... 5వ పేజీ తరువాయి

చీడికాడ, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల మండలాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో మలేరియా నిర్మూలను చర్యలు తీసుకుంటున్నారు. గత మూడు సంవత్సరాల్లో నమోదైన మలేరియా కేసులను ప్రామాణికంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాల్లో ఇండోర్ రెసిడ్యూల్ స్ప్రేయింగ్ (ఐఆర్‌ఎస్) చేపట్టారు. ఇందులో భాగంగా రెండు విడతలుగా దోమల నివారణా చర్యలు తీసుకుంటున్నారు.

108 గ్రామాలలో ఐఆర్‌ఎస్

అనకాపల్లి జిల్లాలో ఎంపిక చేసిన 108 గ్రామాల్లో దోమల నివారణకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఐఆర్‌ఎస్ నిర్వహిస్తున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ పూర్తి చేశారు. జూన్ ఒకటో నుంచి రెండో విడత స్ప్రేయింగ్ మొదలు పెట్టనున్నారు. జిల్లాలోని 135 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో కూడా జూన్ రెండో వారం నుంచి దోమల నివారణ మందును పిచికారీ చేస్తారు.

ఏటా పెరుగుతున్న మలేరియా కేసులు

జిల్లాలో 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు 175 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాది మరో 84 కేసులు పెరిగి మొత్తం 259 కేసులు నమోదు అయ్యాయి. ఈ సంవత్సరం మే 11వ తేదీనాటికి 120 మంది పాజిటివ్ కేసులు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

అవరోధంగా మారిన పారిశుధ్యలోపం

మలేరియాను నిర్మూలించాలన్న లక్ష్యానికి పారిశుధ్యలోపం అవరోధంగా మారింది. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి పోయి దోమల బెడద అధికమవుతున్నది. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షం నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండి పోవడం, వాడి పారేసిన ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, కప్పులు, కొబ్బరి బోండాలు, పాత టైర్లులో ఎకువ రోజులు వర్షం నీరు వుంటే దోమలు వృద్ధి చెందుతున్నాయి.

లక్ష్య సాధనకు....

- జిల్లాలో ఎంపిక చేసిన 108 గ్రామాల్లో ప్రతి ఇంటిలో అన్ని గదుల్లో, బయట గోడలపైన రెండు సార్లు దోమల నివారణ మందును పిచికారీ చేస్తారు.
- జిల్లాలోని 134 బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో జూన్ నెలలో ఒకసారి దోమల నివారణ మందును స్ప్రే చేస్తారు.
- చెరువులు, నీటి నిల్వలు ఉన్న చోట ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేస్తారు.
- మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తారు.

2027నాటికి 'జీరో మలేరియా కేసులు' లక్ష్యం



దోమల కారణంగానే మలేరియా జ్వరాలు ప్రబలుతాయి. అందువల్ల ప్రజలు నివాసాలు, పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. 2027 నాటికి 'జీరో మలేరియా కేసులు' టార్గెట్‌గా పెట్టుకుని పని చేస్తున్నాము. ఎంపిక చేసిన గ్రామాల్లో మొదటి విడత దోమల నివారణ మందు పిచికారీ పనులు దాదాపు పూర్తయ్యాయి. జూన్‌లో రెండో విడత చేపడతాం వసతిగృహాల్లో కూడా దోమల నివారణా చర్యలు తీసుకుంటున్నాం.

\- వరహాలదొర, జిల్లా మలేరియా అధికారి

ప్రాజెక్టుల పరుగు..

... 5వ పేజీ తరువాయి

రూపొందిస్తున్నాం. ఇది పెదగంట్యాడ, నడుపూరు నుంచి నక్కపల్లి వరకు 640 కి.మీ.ల విస్తీర్ణంలో ఉంటుంది. వీఎంఆర్డీఏలో అదనంగా చేరిన 13 మండలాలకు వేరే మాస్టర్ ప్లాన్ తయారవుతున్నది. ఈ మూడు మాస్టర్ ప్లాన్‌లు ఒకదానితో ఒకటి ఇంటిగ్రేట్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- నగరంలోని సిరిపురంలో నిర్మించిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, బీచ్ రోడ్డులోని యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం, ఎండాడ, చీమలాపల్లిల్లో నిర్మించిన కల్యాణ మండపాలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేశాం. ఇవికాకుండా కొత్తగా మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నాం. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా ఇవన్నీ సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా చేపట్టే అవకాశం ఉంది.
- అనకాపల్లిలో కొత్తగా వీఎంఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నాం.
- కైలాసగిరిపై కొత్తగా శివుడికి సింబాలిక్‌గా త్రిశూలాన్ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇది 55 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పున ఉంటుంది. దీనికి రూ.1.5 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశాం. ఆరు నెలల్లోనే దీనిని పూర్తి చేస్తాం. చీకటి పడ్డాక వెలుగులు విరజిమ్మడం దీని ప్రత్యేకత.
- మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనంలో 4, 5 అంతస్థులు ఐటీ కార్యాలయాలకు ఇచ్చేశాం. మూడో అంతస్థులో రెస్టారెంట్, ఫైన్ డైనింగ్ పెడుతున్నాం. అలాగే టెర్రస్‌పై కెఫే ఏర్పాటు చేస్తున్నాం. ఈ భవనంలో స్పేస్ కోసం చాలా సంస్థలు పోటీ పడుతున్నాయి.
- కొత్తగా చేపట్టబోయే ఐదు మాస్టర్ ప్లాన్ రహదారులకు టెండర్లు పిలుస్తున్నాం. వీటిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఈ రహదారులకు భూములు ఇచ్చే రైతులు, గృహస్థులకు వీఎంఆర్డీఏ పరిధి అయితే మేము టీడీఆర్‌లు ఇస్తాం. జీవీఎంసీ పరిధి అయితే వారు ఇస్తారు. ముందు టీడీఆర్‌లు ఇచ్చాకే పనులను ప్రారంభించాలనుకుంటున్నాం.
- విశాఖపట్నం విమానాశ్రయం సమీపాన కాకాని నగర్ వద్ద రూ.12 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణం చేపడుతున్నాం.
- ఎన్‌ఏడీ వద్ద రైలు ఓవర్ బ్రిడ్జి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం.
- మధ్య తరగతి ప్రజల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలని చేసిన ప్రతిపాదనకు మంచి స్పందన వస్తోంది. మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ, వేపగుంట ప్రాంతాల్లో అనువైన భూములు ఉన్నాయి. అన్ని రకాల సదుపాయాలతో వీటిని నిర్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకు ఇవ్వాలని యోచిస్తున్నాం.
- వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో గ్లో గార్డెన్‌కు కొన్ని మార్పులు చేసి పనులు చేపట్టాలని అనుకుంటున్నాం. అదేవిధంగా చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచన మేరకు మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి కోసం ఓ కేంద్రాన్ని నిర్మించి కౌన్సెలింగ్ నిర్వహించే ఏర్పాటు కూడా చేస్తాం.
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి పనులు కొంచెం నెమ్మదిగా జరుగుతున్నాయి. దానిని వేగవంతం చేస్తాం.

క్రైం... crime news

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

కొయ్యూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): భర్తతో జరిగిన గొడవతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ కిశోర్‌వర్మ అందచేసిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్మిక గ్రామానికి చెందిన గోరా శివ, రాజేశ్వరి(25) భార్యాభర్తలు. బుధవారం రాత్రి శివ మద్యం సేవించి ఇంటికి రావడంతో రాజేశ్వరి నిలదీసింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి కంతారం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా వుండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. రాజేశ్వరి తండ్రి ఈదల సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కంటైనర్ లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

పరవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం సెజ్ నుంచి ఉడ్ లోడుతో విశాఖ పోర్టుకు బయలుదేరిన కంటైనర్ లారీ రాంకీ కమర్షియల్ హబ్‌కు ఎదురుగా గురువారం బోల్తా పడింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ కంటైనర్‌ను రహదారి పక్కన ఆపి భోజనానికి వెళ్లాడు. భోజనం ముగించుకొని వెళ్లే సరికి కంటైనర్ ఓ పక్కకు ఒరిగి బోల్తా పడింది. ఇటీవల కురిసిన వర్షానికి రహదారి పక్కన మట్టి బురదగా తయారైంది. ఆ విషయాన్ని గమనించని డ్రైవర్ లారీని అక్కడ నిలపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీశారు.



బోల్తా పడిన కంటైనర్ లారీ

ఏడు మద్యం సీసాలు స్వాధీనం : మహిళ అరెస్టు

మునగపాక, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకపాలెం గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్‌ఐ కె.ఎస్.గణేశ్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించి మడకపాలెం గ్రామానికి చెందిన ఎలమంచిలి నాగమణిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

ఎస్.రాయవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో గురువారం సాయంత్రం ఆటో బోల్తా పడి డ్రైవర్ సేనాపతి లక్ష్మీ వరప్రసాద్ (32) మృతి చెందాడని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సేనాపతి లక్ష్మీ వరప్రసాద్ తన భార్య, ఇద్దరు పిల్లలు, బావమరిదితో కలిసి ఆటోలో చినగుమ్ములూరు వెళుతుండగా పెదగుమ్ములూరు పంచాయతీ పరిధి నీలాంద్రిపురం వద్దకు వచ్చే సరికి అక్కడ రోడ్డుపై గోతుల వలన ఆటో బోల్తా పడింది. ఆటో నడుపుతున్న లక్ష్మీ వరప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లక్ష్మీ వరప్రసాద్‌ను సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతను నాలుగేళ్ల క్రితం ఏఎస్ఆర్ జిల్లా మోతుగూడెం వెళ్లి అక్కడ భార్య, పిల్లలతో నివాసముంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన బంధువుల వివాహ వేడుకల్లో భాగంగా పాల్గొనేందుకు స్వగ్రామం వచ్చాడు. కాగా లక్ష్మీ వరప్రసాద్ పెళ్లి రోజునే మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



మృతుడు సేనాపతి లక్ష్మీ వరప్రసాద్ (ఫైల్)

పిడుగుల వర్షం

... 5వ పేజీ తరువాయి

మూడు గొర్రెలు, శీరా వెంకటరమణకు చెందిన నాలుగు మేకలు, దేవర అప్పల నాయుడుకు చెందిన రెండు మేకలు, కేబీపీ అగ్రహారానికి చెందిన దేవర అప్పారావుకు చెందిన రెండు గొర్రెలు మృతిచెందాయి. వీటి విలువ రూ.5 లక్షలు వుంటుందని బాధితులు తెలిపారు. కాగా మట్టవానిపాలెంలో షైచర్ల విశ్వనాథం పశువుల షెడ్‌పై పిడుగు పడి ఆవు మృతిచెందింది.



రావికమతంలో పిడుగు పడడంతో మృతిచెందిన మేకలు, గొర్రెలు

మాడుగుల మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సత్యవరం గ్రామంలో 20 వరకు విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, పలుచెట్లు నేలకొరిగాయి. ఇళ్లపై రేకులు, తాటాలు లేచిపోయాయి. జంపెన, వీరనారాయణం, తదితర గ్రామాల్లో కూడా విద్యుత్ స్తంభాలు పడిపోయినట్టు సమాచారం. కోటవురట్ల మండలంలోని పలు గ్రామాల్లో సుమారు గంటన్నరపాటు వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగి, చెత్తచెదారం రోడ్లపైకి చేరింది.ఎలమంచిలిలో గురువారం సాయంత్రం గంటపాటు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షంనీరు రోడ్లపై నిలిచిపోయింది. కాగా బుచ్చెయ్యపేట, రాంబిల్లి, ఎస్.రాయవరం, మునగపాక, కశింకోట, కె.కోటపాడు, సబ్బవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, గొలుగొండ, నక్కపల్లి మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. రానున్న రెండు రోజుల్లో జిల్లాలో ఉరుములతో మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా!

... 5వ పేజీ తరువాయి

మూడు వేల మందికిపైగా ఉద్యోగులు వున్నారు. జిల్లా ఏర్పడి మూడేళ్లే అయినందున జిల్లా కేంద్రంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులు చాలా తక్కువగానే ఉంటారని భావిస్తున్నారు. ఇక డివిజన్ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు, రిక్వెస్టు బదిలీలు కలిపి 1,500 మంది వరకు స్థానచలనం ఉంటుందని ఉద్యోగ సంఘాల నేతలు అంచనా వేస్తున్నారు. బదిలీల కోసం ఆయా శాఖల అధిపతులు శుక్రవారం నుంచి ఉద్యోగుల ఉంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. కాగా బదిలీల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

బదిలీలు చేయడం సంతోషం

\- శ్రీరామ్మూర్తి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం సంతోషంగా ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినప్పుడు విశాఖపట్నం నుంచి అనకాపల్లి వచ్చిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించాలి. బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల ఆశలను నెరవేర్చుతున్న కూటమి ప్రభుత్వానికి మా సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524